



2024 చీకటి వెలుగులు

తొలిసగం: అంతులేని అరాచకం

మలిసగం: అభివృద్ధికి అడుగులు







తాము ఏది అనుకుంటే అదే జరగాలనే అహంకారం., జరిగి తీరాలనే దబాయింపు... ఎదురు తిరిగితే దౌర్జన్యం.. కేసులు.. ఐదేళ్లు రాజకీయమంటే ఇదే అని నమ్మి ఆచరించారు నాయకులు. పోలీసులు సాగిలపడడం.. అధికార యంత్రాంగం తలవంచడం.. తమ బలం అనుకున్నారు. ప్రజల మౌనం తమ పాలనకు అంగీకారంగా భావించారు. భయం కూడా ఒక్కోసారి మౌనాన్నే ఆశ్రయిస్తుంది. అది బ్యాలెట్ పెట్టెల్లోనే బద్దలైంది. విదిలిస్తే చాలు పడివుంటారనుకున్న జనమే ఓడించి గుణపాఠం చెప్పారు. 2024 తొలిసగకాలంలో విర్రవీగి చెలరేగిన నాయకులంతా మలిసగకాలంలో మన్నుతిన్న పాముల్లా మిగిలిపోయారు. ఓడలు బండ్లయిన ఈ విచిత్ర స్థితిని వీక్షిస్తున్నారు ప్రజలు. ఓడిన నేతలనే కాదు.. గెలిచిన నాయకుల తీరునూ గమనిస్తున్నారు. 2024 విభిన్న పార్శ్వాల సమాహారం...

– చిత్తూరు, ఆంధ్రజ్యోతి

● ఊపిరి పీల్చుకుంటున్న పుంగనూరు

తొలి సగం: రాష్ట్రంలో మరే ఇతర నియోజకవర్గంలో లేనట్టు పుంగనూరులో పెద్దిరెడ్డి దౌర్జన్య పాలన సాగింది. టీడీపీ, బీసీవై వంటి ప్రతిపక్షాలు బయట తిరగకుండా, ఏ కార్యక్రమాలూ నిర్వహించకుండా పోలీసులతో అడ్డుకునేవారు. హౌస్ అరెస్టులు నిత్యకృత్యమయ్యాయి. టీడీపీలో యాక్టివ్ కార్యకర్తలైన సుమారు 500మందిపై హత్యాయత్నం కేసులు, 150 మందిపై రౌడీషీట్లు నమోదు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జరిగిన దౌర్జన్యాలను అక్కడి ప్రజలు ఇప్పటికీ మరచిపోలేకపోతున్నారు. పెద్దిరెడ్డి అనుచరుల అరాచకాలతో నియోజకవర్గంలో ప్రజలు స్వేచ్ఛగా జీవించే పరిస్థితి ఉండేది కాదు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలూ వైసీపీ నేతల గుప్పిట్లో ఉండేవి. అధికారులంతా వారి ఆదేశాలకు అనుగుణంగా పనిచేసేవారు.

మలి సగం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. ఇక్కడి ప్రజలకు నిజమైన స్వేచ్ఛ లభించింది. ప్రశాంతంగా కార్యాలయాలకు వెళ్లి పనులు చేసుకుంటున్నారు. అధికారులతో సమస్యలు చెప్పుకుంటున్నారు. గతంలోలా దౌర్జన్యాలు, అరాచకాలు కనిపించడం లేదు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో అధికారిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. గతంలో జరిగిన భూఅక్రమాలను సరిచేయడానికి అధికారులకు సమయం సరిపోతోందంటే అప్పట్లో ఏ స్థాయిలో అక్రమాలు జరిగాయో అర్థమవుతుంది.

● ఆగినచోట నుంచే ప్రారంభం

తొలి సగం: పలమనేరు నుంచి తొలిసారి 2019లో గెలిచిన వెంకటేగౌడ మీద తీవ్ర అవినీతి ఆరోపణలున్నాయి. జనార్దన నాయుడి క్వారీని వెంకటేగౌడ ఆక్రమించుకుని ఇబ్బందులు పెడుతున్నారనే విషయాన్ని చంద్రబాబు ఈ ఏడాది తొలిసగంలో ప్రచార సమయంలో బయటపెట్టారు. దీంతోపాటు వెంకటేగౌడ అనుచరులు బెంగళూరుకు ఇసుకను తరలించి కమీషన్లు ఇచ్చేవారని ప్రచారం ఉండేది. ప్రజలకు అందుబాటులో లేకుండా బెంగళూరులో వ్యాపార లావాదేవీల్లో బిజీగా ఉండే పార్ట్‌టైమ్ నేతగా గౌడ మీద స్థానికులకు అభిప్రాయముంది. ఎన్నికల సమయంలో జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు తనకు టికెట్ కావాలని జగన్‌ను అడగడం, బోస్ టీడీపీ నుంచి వైసీపీలోకి వెళ్లడంతో వెంకటేగౌడ టికెట్ విషయంలో కాస్త ఆందోళన చెందాల్సి వచ్చింది.

మలి సగం: 2019-24 మధ్యలో పూర్తిగా ప్రజల్లో ఉండిపోయి నియోజకవర్గమంతా రెండు మూడుసార్లు ఇంటింటి పర్యటన చేసిన అమరనాథ రెడ్డి సాధారణ ఎన్నికల్లో 20వేలకుపైగా మెజార్టీతో గెలుపొందారు. ఆయన పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు నియోజకవర్గానికి తెచ్చుకున్న అభివృద్ధి పనుల్ని వైసీపీ ఆపేయగా.. తాజాగా ఆయన అన్నింటినీ మళ్లీ మంజూరు చేయించుకున్నారు. ప్రస్తుతం అభివృద్ధి పనులన్నీ పురోగతిలో ఉన్నాయి. మంత్రి పదవి ఆశించి భంగపడినా, ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజల కోసం నిత్యం అందుబాటులో ఉంటున్నారు.

● నగరిలో అక్రమాలకు బ్రేకులు

తొలి సగం: వైసీపీ హయాంలో అప్పటి మంత్రి రోజా అనుచరులు మట్టి, ఇసుక, బియ్యం తమిళనాడుకు విచ్చలవిడిగా తరలించేవారు. గంజాయి అమ్మకాలు జోరుగా సాగేవి. ఈమెకు నెల మామూళ్లు వెళ్లేవి. క్వారీల్లో అయితే సగం వాటా ఈమెకు ఇవ్వాల్సి వచ్చేది. వెంచర్లు వేసినవారిని కూడా వేధించి ప్లాట్లు రాయించుకునేవారు. పర్యాటక శాఖ మంత్రిగా ఉన్న ఆమె ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది తొలి సగంలోనూ తన మార్కు చూపించలేకపోయారు. నిత్యం ప్రతిపక్షాలపై నోరు పారేసుకోవడానికే సమయాన్ని కేటాయించేవారు.

మలి సగం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అక్రమాలకు బ్రేకులు పడ్డాయి. విజయపురం మండలంలోని క్వారీలు పూర్తిగా ఆగిపోయాయి. నగరిలో గతంలోని లైసెన్సుల మీద స్థానికంగా మట్టిని తరలించుకుంటున్నారు. తమిళనాడుకు ఇసుక రవాణాను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కల్పించుకుని ఆపేశారు. బియ్యం అక్రమ రవాణా కూడా ఆగిపోయింది. భూకబ్జాలు జరగకుండా చూడాలని రెవెన్యూ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

జిల్లాకు పదవులు : టీడీపీ కుప్పం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్ మునిరత్నానికి ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌గా, మాజీ మేయర్ కటారి హేమలతకు చుడా ఛైర్మన్‌గా, కుప్పానికి చెందిన శాంతారామ్‌కు టీటీడీ బోర్డు సభ్యుడిగా, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్‌కు వన్నియకుల క్షత్రియ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పదవులు దక్కాయి.చాలా మంది ఆశావహులు నామినేటెడ్ పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. సంక్రాంతిలోగా మార్కెట్ కమిటీ ఛైర్మన్ పోస్టుల్ని భర్తీ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

మంత్రి లేని జిల్లా : వైసీపీ హయాంలో..ముగ్గురు మంత్రులు పెద్దిరెడ్డి, నారాయణస్వామి, రోజా జిల్లాలో పనిచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాకు మంత్రి పదవి లభిస్తుందని అనుకున్నా.. సాధ్యం కాలేదు. చెప్పాలంటే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎవ్వరికీ మంత్రి పదవి లభించలేదు. సీఎం మన జిల్లా వాడు అని సంతృప్తి చెందాల్సి వస్తోంది. అలాగే జిల్లాకు 'పెద్ద దిక్కు' అనే ప్రకటన లేకపోవడం, ఎమ్మెల్యేలు కొత్తవారు కావడంతో అధికారులు కొంతమంది వారిని లెక్కచేయడం లేదనే విమర్శలున్నాయి.

● ఆ ముగ్గురు

తొలి సగం: పూతలపట్టు నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు టికెట్ ఇవ్వకపోవడం.. ప్రెస్‌మీట్‌లో తనకు జరిగిన అన్యాయాన్ని ఎంఎస్ బాబు వివరించడంతో వైసీపీకి దళితుల పట్ల ఉన్న చిన్నచూపు తేటతెల్లమైంది.చిత్తూరులో ఎమ్మెల్యేకు మించి ఐదేళ్ల పాటు అధికారం అనుభవించిన విజయానందరెడ్డి టికెట్ తెచ్చుకున్నారు.జీడీనెల్లూరులో నారాయణస్వామి తన కుమార్తె కృపాలక్ష్మికి టికెట్ ఇప్పించుకున్నారు.

మలి సగం: జీడీనెల్లూరు, పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు థామస్, మురళీమోహన్, జగన్మోహన్ తొలిసారి గెలిచారు. మురళీ తన జర్నలిజం అనుభవాన్ని, గురజాల తన వ్యాపార అనుభవాన్ని ఉపయోగించి పాలనలో తమ మార్కు వేస్తున్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్నారు. జగన్మోహన్ చిత్తూరు అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికతో దూసుకుపోతున్నారు. పర్టిలిటీ రంగంలో నిపుణుడైన థామస్ అటు వైద్యుడిగా, ఇటు ఎమ్మెల్యేగా బ్యాలెన్సు చేసుకుంటున్నారు.

● పని తెలిసిన ఎంపీ దగ్గుమళ్ల



తొలి సగం: వైసీపీ హయాంలో చిత్తూరు ఎంపీగా పనిచేసిన రెడ్డెప్ప పెద్దిరెడ్డి అనుచరుడిగా మిగిలిపోయారు.ఈ ఏడాది తొలిసగంలో పెద్దిరెడ్డి చేతుల మీదుగా బీఫాం అందుకునే సమయంలోనూ ఆయన కాళ్ల మీద పడి స్వామిభక్తి చాటుకున్నారు. చిత్తూరు ఎంపీ స్థానం నుంచి జీడీనెల్లూరు అసెంబ్లీ స్థానానికి వైసీపీ అధిష్ఠానం మార్చినా నోరు విప్పకుండా తల ఊపారు. ఆయా సమస్యలపై అధికారులతో సమీక్షించే నేర్పు కూడా లేదనే విమర్శలు పొందారు. తన మార్కు లేకుండానే ఐదేళ్ల కాలాన్ని పూర్తి చేసేశారు.

మలి సగం: ఐఆర్ఎస్ అధికారిగా పనిచేస్తూ చంద్రబాబు విజన్‌ను చూసి రాజకీయాల్లోకి వచ్చిన ప్రస్తుత ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద రావు ఆరు నెలల్లోనే తన మార్కు చూపించారు. చిత్తూరు ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన తక్కువ సమయంలోనే నియోజకవర్గంలోని ఎమ్మెల్యే అభ్యర్థులతో సమన్వయం చేసుకుని కార్యక్రమాలు నిర్వహించారు. పార్లమెంటు చరిత్రలోనే అత్యధిక మెజార్టీతో గెలిచారు. జిల్లాకు ఎంఎస్ఎంఈ పరిశ్రమలు తేవడం కోసం, మామిడి బోర్డు ఏర్పాటు కోసం, చిత్తూరు కేంద్రీయ విద్యాలయ కోసం కేంద్ర పెద్దల్ని కలవడం, లెటర్లు రాయడం వంటి పనులు చేస్తున్నారు. ఇప్పటికే సుమారు రూ.5 కోట్ల ఎంపీ నిధుల్ని ఖర్చు చేశారు. అధికారులతో ఆయా అంశాలపై నేరుగా సమీక్షిస్తున్నారు.

● అరాచకం నుంచి అభివృద్ధి దిశగా కుప్పం

తొలి సగం: కుప్పం నియోజకవర్గం మీదా పెద్దిరెడ్డి దృష్టి పెట్టి అక్కడి టీడీపీ శ్రేణులపై అక్రమ కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేశారు. గత ఏడాది జనవరి 5న జీవో1 పేరుతో చంద్రబాబును సొంత నియోజకవర్గంలో అడ్డుకున్నారు. జనవరి 27న నారా లోకేశ్ యువగళం పాదయాత్రకు అనేక ఆంక్షలు పెట్టి ఇబ్బందులకు గురి చేశారు.నియోజకవర్గంలో వందల అక్రమ క్వారీల నిర్వహణతో రూ.కోట్ల కమీషన్లు తీసుకునేవారనే ఆరోపణలున్నాయి. ఆ కమీషన్ల డబ్బును మున్సిపల్ ఎన్నికల్లో ఓటుకు రూ.5 వేల చొప్పున పంపిణీ చేసి ఛైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకున్నారు. సాధారణ ఎన్నికల్లోనూ చంద్రబాబును ఓడిస్తానని తండ్రీ కొడుకులు పెద్దిరెడ్డి, మిథున్ రెడ్డి ఎన్నికలకు ముందు హంగామా చేశారు.



కుప్పంలోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్

మలి సగం: సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తున్నారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన జూన్ నెలలోనే కుప్పంలో పర్యటించి అభివృద్ధికి ప్రణాళికలు రచించారు. విమానాశ్రయ ఏర్పాటుకు భూమి సేకరణ, కృషి విజ్ఞాన కేంద్రానికి భూకేటాయింపు, హంద్రీనీవా కుప్పం బ్రాంచి కెనాల్‌కు కాంక్రీట్ లైనింగ్ కోసం రూ.197 కోట్లు విడుదల, కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు భూపరిశీలన, 2318 మంది రైతుల 4002 ఎకరాల మిగులు భూముల సమస్య పరిష్కారం వంటి అనేక కార్యక్రమాలు చేపట్టారు. నియోజకవర్గ అభివృద్ధి పర్యవేక్షణకు ప్రత్యేకంగా ఐఏఎస్ అధికారి వికాస్‌ను నియమించారు.చంద్రబాబు సతీమణి భువనేశ్వరి కూడా నిత్యం కుప్పంలో పర్యటించి శ్రేణులకు భరోసా ఇస్తున్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్ మునిరత్నం వంటి నేతలు కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్నారు.మొత్తానికి వైసీపీ హయాంలోలా కాకుండా కుప్పం ప్రశాంతంగా జీవిస్తోంది.

చలి పులి!



పలమనేరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చలి వణికిస్తోంది.డిసెంబరులో చలి సాధారణమే అయినప్పటికీ ఈ ఏడాది ఎన్నడూ లేని విధంగా డిసెంబరు 26 వరకూ తుపాన్ల కారణంగా ముసురు పట్టుకొని తుంపర్లు పడుతుండేవి.దీంతో పెద్దగా చలి అనిపించలేదు.రెండురోజులుగా మాత్రం చలిగాలులు వీస్తున్నాయి. ఇళ్లనుంచి ఉదయం 7 గంటలకు కూడా ప్రజలు బయటకు వచ్చేందుకు వెనకాడుతున్నారు. ఒక వైపు దట్టమైన మంచు కురుస్తుండడం, మరోవైపు చలిగాలులు వీస్తుండడంతో ఉదయపు వేళ జనం బయటకు రావడం తగ్గించేశారు.సాధారణంగా చలిమంటలు గ్రామాల్లో వేసుకోవడం ఆనవాయితీ. అయితే పలమనేరులో తెల్లవారుజామునే బస్సులకోసం వచ్చిన ప్రజలు సైతం చలికి తట్టుకోలేక చలిమంటలు వేసుకుంటున్నారు. జాతీయ రహదారిపైన, ఆర్టీసీ బస్టాండు పరిసరాల్లో కూడా ప్రజలు చలికి తట్టుకోలేక చలిమంటలు వేసుకోవడం ప్రారంభించారు.

విద్యుత్ రంగాన్ని నాశనం చేసింది జగన్ ప్రభుత్వమే

● ఎమ్మెల్యేలు నాని,మురళి



మీడియా సమావేశంలో ఎమ్మెల్యేలు నాని, మురళీమోహన్ తదితరులు

చిత్తూరు సిటీ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగాన్ని సర్వనాశనం చేసింది జగన్ ప్రభుత్వమేనని చంద్రగిరి, పూతలపట్టు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, కలికిరి మురళీ మోహన్ ఆరోపించారు. శనివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం విద్యుత్ కొనుగోళ్లలో భారీ అక్రమాలకు పాల్పడిందని అన్నారు. సోలార్ ప్లాంట్లపై దాడి, చట్టవిరుద్ధంగా పీపీఏలను రద్దుచేయడంతో రాష్ట్రం సుమారు 7వేల మెగా వాట్ల విద్యుత్‌ను కోల్పోయిందని మండిపడ్డారు. దీనికి కారణమైన మాజీ సీఎం జగన్‌రెడ్డి ఇంటిముందు వైసీపీ శ్రేణులు ధర్నా చేయాలని సూచించారు. తాను పెంచిన విద్యుత్ చార్జీలపై తన పార్టీ నేతలు, శ్రేణులతో ధర్నాలు చేయించడం జగన్ అవగాహన రాహిత్యానికి నిదర్శనమని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం పదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచిందన్నారు. జెన్కో విద్యుత్ ప్లాంట్ల ద్వారా యూనిట్ రూ.5 వచ్చేదాన్ని కాదని కమీషన్లకోసం బహిరంగ మార్కెట్‌లో రూ.8 నుంచి రూ.14వరకు కొనుగోలు చేశారని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం 200 యూనిట్ల కంటే తక్కువ వాడుతున్న పేదలకు ఎటువంటి చార్జీలు పెంపుదల చేయలేదని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తుందన్నారు. ఇకనైనా వైసీపీ నేతలు తమ తీరు మార్చుకోవాలని హితవు పలికారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి, చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, నేతలు మోహన్‌రాజ్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఏ పరీక్షల్లో మెరిశారు!



రిషబ్ ఓస్వాల్ - శశిశ్రీనివాస్

పలమనేరు, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి) : సీఏ ఫైనల్ పరీక్షా ఫలితాల్లో పలమనేరు విద్యార్థులు ప్రతిభ చాటారు. పట్టణానికి చెందిన రిషబ్ ఓస్వాల్ మొదటి ర్యాంకు సాధించగా మరో విద్యార్థి శశిశ్రీనివాస్ ఫస్టుక్లాస్‌లో పాసయ్యాడు. చిన్ననాటి నుంచి వీరిద్దరూ పట్టణ సమీపంలోని ఈమాస్ ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాలలో ఎల్‌కేజీ నుంచి 10వ తరగతి వరకు చదువుకొన్నారు.టెన్త్‌లో వరుసగా 97,96 శాతం మార్కులు సాధించారు.గుంటూరు మాస్టర్‌మైండ్స్‌లో చదువు కొనసాగించారు. సీఏ ఫౌండేషన్‌లో జాతీయ స్థాయిలో వరుసగా వీరిద్దరూ ఒకటి, రెండు స్థానాలు సాధించారు. సీఎంఏ ఫౌండేషన్‌లోను జాతీయ స్థాయిలో 1,3 స్థానాల్లో నిలిచారు. వీరిద్దరూ పలమనేరు స్థాయిని జాతీయస్థాయికి తీసుకు వెళ్లారంటూ పట్టణవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చాట్‌బాట్‌తో 450 ఫోన్ల స్వాధీనం



ఫోన్లు అందుకున్నవారితో ఎస్పీ మణికంఠ తదితరులు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చాట్‌బాట్ ద్వారా 90 లక్షల విలువైన 450 ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐదు నెలల కాలంలో దొంగలు కొట్టేయడం, జారవిడుచుకోవడం తదితర కారణాలతో పలువురు ఫోన్లను పోగొట్టుకున్నారు. అలాంటి వారి ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించినట్లు ఎస్పీ మణికంఠ తెలిపారు. పోలీసు అతిథి గృహంలోని కాన్ఫరెన్స్ హాలులో వివరాలను శనివారం మీడియాకు తెలిపారు. తొలి విడతలో కోటి విలువైన 500 ఫోన్లు, రెండో విడతలో 45లక్షల విలువైన 200 ఫోన్లు, మూడో విడతలో 60 లక్షల విలువైన 300 ఫోన్లు, నాల్గవ విడతలో 45 లక్షల విలువైన 200 ఫోన్లు, ఐదో విడతలో 65 లక్షల విలువైన 300 ఫోన్లు, ఆరో విడతలో 45 లక్షల విలువైన 200 ఫోన్లు, ఏడో విడతలో 70 లక్షల విలువైన 330 ఫోన్లు, ఎనిమిదో విడతలో 66 లక్షల విలువైన 305 ఫోన్లు, తొమ్మిదో విడతలో 65 లక్షల విలువైన 300 ఫోన్లు, తాజాగా పదో విడతలో 90 లక్షల విలువైన 450 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించారు. అధిక శాతం జిల్లాలోనే కాకుండా తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర నుంచి కూడా ఫోన్లను రికవరీ చేశారు. జిల్లాలో చాట్‌బాట్ బృందం సేవలు భేషుగ్గా ఉన్నాయని ఎస్పీ అభినందించారు. ఫోన్లను రికవరీ చేయడానికి ఈ బృందంలోని సభ్యులైన క్రైమ్ సీఐ ఉమామహేశ్వరావు, సిబ్బంది బాషాజీ, శ్రీనివాసన్, రఘురామన్ ఆధ్వర్యంలోని సాంకేతిక బృందం కృషి ఫలితంగానే పది విడతల్లో 6.51 కోట్ల విలువైన 3,085 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించామన్నారు. ఇంకా కొన్ని పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా త్వరలో రికవరీ చేస్తామని చెప్పారు.

ఫిర్యాదు ఇలా చేయాలి

మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నవారు ముందుగా 94409 00004 వాట్సాప్‌కు హాయ్ లేదా హెల్ప్ అని మెసేజ్ పెట్టాలి. వెల్‌కమ్ టు చిత్తూరు పోలీసు పేరున ఒక లింకు మెసేజ్ పంపిన మొబైల్‌కు వస్తుంది. ఆ లింకులో గూగుల్ ఫార్మేట్ ఓపెన్ అవుతుంది. అందులో పేర్కొన్న వివరాలన్నీ పూరించాలి. తర్వాత సబ్మిట్ చేస్తే ఫిర్యాదు నమోదవుతుంది.

టీటీడీ బోర్డు సభ్యులతో ప్రత్యేక కమిటీల ఏర్పాటు

తిరుమల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. 16 కమిటీల సభ్యుల వివరాలను శనివారం జేఈవో వీరబ్రహ్మం వెల్లడిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ఫైనాన్స్ కమిటీలో జాస్తి పూర్ణసాంబశివరావు,కృష్ణమూర్తి వైద్యనాథన్, సుచిత్ర ఎల్లా, ఎఫ్ఏ అండ్ సీఏవో(కన్వీనర్), కొనుగోళ్ల కమిటీలో జ్యోతుల నెహ్రూ, సదాశివరావు, ఆర్ఎన్ దర్శన్, జీఎం ప్రొక్యూర్మెంట్(కన్వీనర్), ఇంజనీరింగ్ కమిటీలో రాజశేఖర గౌడ్, శాంతారాం, ఆనందసాయి, చీఫ్ ఇంజనీర్(కన్వీనర్), ఎస్టేట్ కమిటీలో జ్యోతుల నెహ్రూ, జంగా కృష్ణమూర్తి, రంగసాయి, ఎస్టేట్ ఆఫీసర్ తిరుపతి(కన్వీనర్)గా ఉంటారు. అప్పీల్స్ కమిటీలో ఆర్ఎన్ దర్శన్,నరేష్‌కుమార్,అదిత్‌దేశాయ్, ఎండోమెంట్ కమిషనర్, డీఏ సెక్షన్ డిప్యూటీఈవో (కన్వీనర్), ఎడ్యుకేషన్ కమిటీలో ఎంఎస్ రాజు, పనబాక లక్ష్మి, భానుప్రకాష్ రెడ్డి, డీఈవో(కన్వీనర్), మెడికల్ కమిటీలో నర్సిరెడ్డి, మునికోటేశ్వరరావు, సౌరభ్‌బోరా, చీఫ్ మెడికల్ ఆఫీసర్(కన్వీనర్)గా ఉంటారు. అలాగే హెచ్‌డీపీపీ, స్విమ్స్ గవర్నింగ్ కౌన్సిల్, స్విమ్స్ ఎగ్జిక్యూటివ్ బోర్డు, బర్డ్ ట్రస్టు, ఎస్వీబీసీ బోర్డు, ఆర్ట్స్ కాలేజీ, ఎస్‌జీఎస్ కాలేజీ, ఎస్వీడబ్ల్యూ డిగ్రీ, పీజీ కాలేజీ, న్యూఢిల్లీ ఎస్వీ కాలేజీలకు గవర్నింగ్ బాడీలకు సభ్యులను నియమించారు.

45 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల ఆరో తేదీన మొదలైన రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. శనివారం 45 గ్రామాల్లో జరిగిన సదస్సుల్లో 625 మంది హాజరై 517 అర్జీలు అందజేశారు. జిల్లాలోని 822 రెవెన్యూ గ్రామాలకుగాను ఇప్పటివరకు 607 గ్రామాల్లో సదస్సులు పూర్తయ్యాయి. ఇప్పటి వరకు సదస్సుల్లో 28,815 మంది పాల్గొన్నారు.

22 మండలాల్లో వర్షం

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 22 మండలాల్లో వర్షం కురిసింది. శుక్రవారం ఉదయం 8 నుంచి శనివారం ఉదయం 8 గంటల వరకు నమోదైన వర్షపాత వివరాలు ఇలా ఉన్నాయి. మండలాల వారీగా.. పాలసముద్రంలో 24.2, చిత్తూరు రూరల్‌లో 24, చిత్తూరులో 22, యాదమరిలో 18.4, బంగారుపాళ్యంలో 14.8, రొంపిచెర్లలో 14.6, గుడిపాల, తవణంపల్లెలో 11, గంగవరంలో 10.6, పూతలపట్టులో 9.4, పలమనేరులో 8.4, శాంతిపురం, బైరెడ్డిపల్లెలో 7.6, వి.కోటలో 6.8, పులిచెర్లలో 6.2, సదుంలో 6, చౌడేపల్లె, పెద్దపంజాణిలో 5.2, కుప్పంలో 4.2, పుంగనూరులో 3.4, గుడుపల్లెలో 2.6, పెనుమూరులో 0.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

తిరుపతిలో డీజీపీ



జిల్లా పోలీసు కార్యాలయ కాంప్లెక్స్ వద్ద డీజీపీ ద్వారకాతిరుమలరావుతో ఎస్పీ తదితరులు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): డీజీపీ ద్వారకా తిరుమలరావు రెండు రోజుల పర్యటన నిమిత్తం శనివారం సాయంత్రం కుటుంబ సమేతంగా తిరుపతికి విచ్చేశారు. విజయవాడ నుంచి రేణిగుంటలోని విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ఎస్పీ సుబ్బరాయుడు, అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు స్వాగతం పలికారు. అక్కడి నుంచి కారులో తిరుపతిలోని పోలీసు అతిథి గృహం వద్దకు చేరుకుని విశ్రాంతి తీసుకున్నారు. అనంతరం జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండులో రూ 6.41 కోట్లతో నిర్మిస్తున్న జిల్లా పోలీసు కార్యాలయ కాంప్లెక్సు భవనాలను పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అక్కడే ఉన్న ఫోరెన్సిక్ ల్యాబ్, రిజర్వు గ్రౌండును పరిశీలించారు. సాయంత్రం 5.50 గంటలకు పోలీసు అతిథి గృహం చేరుకుని అక్కడి నుంచి తిరుమలకు బయలుదేరి వెళ్లారు.ఆదివారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు. ఏఎస్పీలు వెంకట్రావు, రవి మనోహరాచారి, శ్రీనివాసులు ఆయన వెంట ఉన్నారు.



నిద్ర చోటెరగదు

ఆర్టీసీ బస్టాండు ముందు తిరుమల బైపాస్ రోడ్డులో భక్తుల సౌకర్యార్థం గతంలో అండర్‌పాస్ ఏర్పాటు చేశారు. అది ప్రస్తుతం ఉపయోగంలో లేదు. అండర్‌పాస్‌కు వెలుతురు కోసం డివైడర్ మధ్యలో స్లాబ్ వేయకుండా ఖాళీ పెట్టారు. పొరపాటున ఎవరూ అందులో పడిపోకుండా ఇనుపకంచె(రూఫ్) ఏర్పాటు చేశారు. ఆ స్థలమే ప్రస్తుతం బిచ్చగాళ్ల నిద్రకు స్థావరంగా మారిపోయింది. ఆ దారిన పోయే వాళ్లు దీన్ని చూసి నిద్ర చోటెరగదంటే ఇదేనేమో అని చర్చించుకుంటున్నారు.


- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల రద్దీ నెల కొంది. శనివారం త్రయోదశి కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 35వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 4,710మంది, రూ.50ప్రత్యేక దర్శనం 3,008మంది దర్శించుకున్నారు. రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 3,002మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,347, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 383మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 388మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 122మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 26,488 అమ్ముడైనట్లు తెలిపారు.

శ్రీహరి సర్వదర్శనానికి 17 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 17 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2లోని 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరి షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూ కృష్ణతేజ గెస్ట్‌హౌస్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం నాటి హుండీ ఆదాయం: రూ.4.06 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,715

తలనీలాలు సమర్పించినవారు: 24,503







తిరుపతి బాలోత్సవం ప్రారంభం

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రతిభ

చిన్నారుల కళా పండుగ







తిరుపతి నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌లో బాలోత్సవం ప్రారంభ వేదికపై నిర్వాహకులు, అతిథులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతి బాలోత్సవంలో ఓ కళా ప్రపంచం ఆవిష్కృతమవుతోంది. పలు కళా విన్యాసాలకు తిరుపతి నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ వేదికగా నిలుస్తోంది. ఈ వేడుక శనివారం ప్రారంభమైంది. చిన్నారుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని డీఈఓ కేవీఎన్ కుమార్ ప్రారంభించారు. సుమారు 30 రకాల పోటీల్లో, 70 విభాగాల్లో చిన్నారుల ప్రతిభాపాటవాలు అబ్బుర పరుస్తున్నాయి. 147 ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన 1,200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రారంభ కార్యక్రమంలో బాలోత్సవం వ్యవస్థాపకుడు మల్లారపు నాగార్జున, గౌరవాధ్యక్షుడు టెంకాయల దామోదరం, అధ్యక్షుడు నడ్డి నారాయణ, పారిశ్రామికవేత్త పీసీ రాయల్, ఆఫీసర్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు తమటం రామచంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడు సుంకర రెడ్డెప్ప, పయ్యావుల గురునాథం, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, న్యాయ నిర్ణేతలు, కళాభిమానులు పాల్గొన్నారు.

నేడు బహుమతుల ప్రదానం

3, 4, 5 తరగతుల విద్యార్థులను సబ్ జూనియర్స్‌గా, 6, 7 తరగతుల విద్యార్థులను జూనియర్స్‌గా, 8, 9, 10 తరగతుల వారిని సీనియర్ విభాగాలుగా విభజించి పోటీలు నిర్వహిస్తున్నారు. న్యాయ నిర్ణేతలు పరిశీలించి విజేతల జాబితా రూపొందిస్తున్నారు. ముగింపు సభలో బహుమతులను ప్రదానం చేయనున్నారు.

స్పందన బాగుంది



పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకే బాలోత్సవం చేపడుతున్నాం. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల నుంచి స్పందన బాగుంది. ఈ ఉత్సాహంతో భవిష్యత్తులోనూ తిరుపతి బాలోత్సవాన్ని నిర్వహించాలనే ఆసక్తి కలుగుతోంది.

- నడ్డి నారాయణ, తిరుపతి బాలోత్సవం అధ్యక్షుడు

భళా చిన్నారుల ప్రతిభ



బాల్యం నుంచే పిల్లలను మంచి మార్గంలో నడపడానికి బాలోత్సవం నిర్వహిస్తున్నాం. తిరుపతి, పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు తరలివచ్చి ప్రతిభను అద్భుతంగా ప్రదర్శిస్తున్నారు. చిన్నారుల ప్రతిభ అబ్బుర పరుస్తోంది.

- టెంకాయల దామోదరం, బాలోత్సవం గౌరవాధ్యక్షుడు

చిన్నారుల కళా ప్రపంచం



బాలోత్సవం చిన్నారుల కళా ప్రపంచాన్ని తలపిస్తోంది. అనేక మంది చిన్నారులు తమలోని కళలను ప్రదర్శిస్తున్నారు. ఒక టీచర్‌గా ఈ దృశ్యాన్ని పదిలంగా దాచుకొని సంబరపడుతున్నాను. పిల్లల పండుగ చూడాలని ఆసక్తిగా వచ్చాను.

- ఎన్.సత్యసుభాషిణి, టీచర్, కోదండరామస్వామి స్కూల్

దేశభక్తి పాటలు పాడా



దేశభక్తి పాటలు పాడాను. పాడుతున్నంత సేపూ తెలియని ఉద్వేగం కలిగింది. గాంధీ నుంచి భగత్‌సింగ్ వరకూ అందరినీ పాటల రూపంలో జ్ఞాపకం చేసుకోవడం గర్వంగా అనిపించింది.

- ఎ.శ్రీరసజ్ఞ, 6వ తరగతి, సిల్వర్ ఓక్స్ స్కూల్, తిరుపతి

వేమన పద్యాలతో నీతిని చాటుతున్నా



వేమన పద్యాల్లోని నీతి నన్ను చాలా ఆకట్టుకుంది. పద్యం పోటీల్లో వీటిని పాడాను. భవిష్యత్తులో వేమన పద్యాల్లోని నీతిని చాటాలనే ఆలోచన ఉంది. తెలిసిన వేమన పద్యాన్ని పాడేందుకు బాలోత్సవం వేదిక లభించింది.

- యోషితప్రియ, భాష్యం స్కూల్, తిరుపతి

ఆత్మవిశ్వాసం కలిగింది



చదరంగం (చెస్) అంటే చాలా ఇష్టం. చదరంగంలో నా ఆసక్తినీ, ప్రతిభను గుర్తించి మా స్కూల్ టీచర్స్ బాలోత్సవం పోటీలకు తీసుకొచ్చారు. ఏకాగ్రతతో చదరంగం ఆడాను. నలుగురిలో చదరంగం ఆడాననే ఆత్మవిశ్వాసం, ఆనందం కలిగింది.

- మోహిత్‌సాయి, చైతన్యభారతి స్కూల్, తిరుపతి

లేఖ రాయడం ఓ అనుభూతి



లేఖా రచన పట్ల నాలో ఆసక్తి పెరుగుతోంది. దూరంగా ఉండే ఆత్మీయులకు లేఖ రాయడంలో ఆనందం, అనుబంధం కనిపిస్తాయి. మాటల్లో చెప్పలేని ఎంతో ఆత్మీయతను లేఖ ద్వారా వ్యక్తం చేయవచ్చు.

- ఎమ్మిశెట్టి భానజీరెడ్డి, స్ప్రింగ్‌డేల్ స్కూల్, తిరుపతి

ఊహలకు రంగులద్దుతున్న చిన్నారులు



ఏ భావానికి ఏ చిత్రానికీ ఎక్కడ ఎలాంటి రంగు దిద్దాలనే విషయంలో చిన్నారులు చాలా శ్రద్ధ కనబరుస్తున్నారు. వాటర్ కలర్స్, అకరలిక్స్, ఆయిల్ పెయింటింగ్, తాంజూర్ వంటి అంశాల్లో చిన్నారులు తమ ఊహలకు రంగులు అద్దుతూ ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నారు.

- జి.గాయత్రీదేవి, చిత్రలేఖనం న్యాయ నిర్ణేత

స్టేషన్‌కు వచ్చే బాధితులకు అండగా ఉండాలి

- మత్తు పదార్థాల వినియోగం, రవాణాపై ఉక్కుపాదం మోపండి
- క్రైం సమీక్షా సమావేశంలో ఎస్పీ సుబ్బరాయుడు



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల పోలీసు యంత్రాంగం మర్యాదగా, స్నేహపూర్వకంగా మెలిగి వారికి అండగా నిలవాలని ఎస్పీ సుబ్బరాయుడు సూచించారు. పద్మావతి విశ్వవిద్యాలయంలోని సావేరి అతిథి గృహంలో శనివారం జిల్లా నేర సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు అధికారులు శాంతి భద్రతల పరిరక్షణకు పెద్దపీట వేయాలన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలకు సంబంధించిన ఫిర్యాదులపై స్పందించాలన్నారు. కేసుల పురోగతిపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని ఆదేశించారు. పండుగలు, పర్వదినాల్లో జూదం, మట్కా, కోడి పందేలు, డీజే సౌండ్లు, రికార్డింగ్ డ్యాన్స్, అశ్లీల చిత్రాలకు అనుమతి లేదన్నారు. గంజాయి, మత్తు పదార్థాల అమ్మకం, సరఫరాను అరికట్టడానికి కృషి చేయాలని కోరారు. బార్లు, మద్యం దుకాణాలు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి దుకాణం, షాపింగ్ మాల్స్, అపార్టుమెంట్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. చట్ట విరుద్ధంగా నిర్వహించే కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. కచ్చితమైన ఆధారాలు లేకుండా నిర్బంధించడం, శిక్షించడం వంటి చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసులు ప్రతిరోజూ తనిఖీలు చేసి లైసెన్సు లేనివారు, త్రిబుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్‌లపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచ్చారి, శ్రీనివాసరావు, నాగభూషణరావు, రామకృష్ణ, ఎస్బీ డీఎస్పీ గిరిధర్, సీఐ శ్రీనివాసులు, తిరుపతి డీఎస్పీ వెంకటనారాయణ, చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, వెంటకగిరి డీఎస్పీ చెంచుబాబు, అన్ని సబ్ డివిజన్ల డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

తేలిక దున్నకాలతో మామిడి పూతకు అవకాశం

- జిల్లా వ్యవసాయ వనరుల అధికారి





తిరుపతి(ఎంఆర్‌పల్లె), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మామిడిలో మంచి పూత రావడానికి రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ వనరుల అధికారి మెరుగు భాస్కరయ్య సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదైనందున మంచి దిగుబడికి అవకాశం ఉందన్నారు. వర్షాలు తగ్గాక తోటల్లో రైతులు తేలికగా దున్నుకోవాలన్నారు. దీనివల్ల భూమిలోని తేమ ఆవిరై బెట్ట పరిస్థితి ఏర్పడి పూతరావడానికి వీలుంటుందన్నారు. తోటలో తేలిక దున్నడం వలన కలుపు మొక్కలను నివారించుకోవచ్చన్నారు. శుభ్రత పాటిస్తే చీడల బెడదను తగ్గించుకోవచన్నారు. తోట దున్నిన తర్వాత చెట్లను పొటాషియం నైట్రేట్ లీటరు నీటికి 10 గ్రాములు, ఫార్ములా-4 సూక్ష్మ పోషకాలు మిశ్రమాన్ని లీటరు నీటికి 2-3 గ్రాములు కలిపి స్ప్రే చేయాలన్నారు. దీంతో చెట్లలో పూమొగ్గలు ఉత్తేజితమై పూత బాగా వస్తుందన్నారు.

ఎగ్జిక్యూటివ్ కోటా పీహెచ్‌డీ సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో ఎగ్జిక్యూటివ్ కోటాలో పీహెచ్‌డీ సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు కోరారు. దరఖాస్తుకు జనవరి 21వ తేదీ చివరి గడువుగా విధించినట్టు ఆయన తెలిపారు. పదేళ్ల ప్రభుత్వ, ప్రైవేట్, పారిశ్రామిక రంగాల్లో కార్యనిర్వాహణ అధికారిగా అనుభవం ఉన్న వారు ఇందుకు అర్హులని చెప్పారు. గ్రూప్-1 సర్వీస్ హోదాకి సమాంతర సర్వీస్ కలిగి నెలకు రూ.1 లక్ష వేతనం కలిగి ఉండాలని కోరారు. ప్రైవేట్, పారిశ్రామిక రంగాలకు చెందిన వారైతే రూ.25 కోట్ల పైగా లావాదేవీలు కలిగి ఉండాలని సూచించారు. ఇందుకు సంబంధించిన ఆడిట్ రిపోర్టును సమర్పించవలసి ఉంటుందని వివరించారు. అభ్యర్థులు కనీసం రెండేళ్ల ఆదాయ పన్ను శాఖ జమ చేసిన ఖాతాను జతపరచాలని పేర్కొన్నారు. గుర్తింపు పొందిన ప్రముఖ జర్నల్స్‌లో అభ్యర్థి పేరుతో రెండు పరిశోధనా పత్రాలు ప్రచురితమై ఉండాలని తెలియజేశారు. పార్ట్ టైం ప్రాతిపదికన పరిశోధనా కోర్సు రూపకల్పన చేసినట్టు తెలిపారు. అర్హత కల్గిన అభ్యర్థులు యూనివర్సిటీ రీసెర్చ్ కమిటీ ఎదుట పరిశోధనాంశంపై మౌఖిక నివేదిక సమర్పించవలసి ఉంటుందని వివరించారు. సమగ్ర సమాచారం కోసం ఎస్వీ యూనివర్సిటీ.ఎడ్యూ.ఇన్. వెబ్‌సైట్ చూడాలని రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఒక ప్రకటనలో కోరారు.

ఎస్వీయూ పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షల వాయిదా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు వాయిదా పడ్డాయి. తొలుత ఈ నెల 30వ తేదీ నుంచీ పరీక్షలు నిర్వహించాలని షెడ్యూల్ ప్రకటించారు. అయితే విద్యార్థుల విన్నపం మేరకు జనవరి 3వ తేదీకి పరీక్షలు వాయిదా పడ్డాయి. ఈ మేరకు వర్సిటీ పరీక్షల అధికారి దామ్లా నాయక్ తెలిపారు.



కియోస్క్ మిషన్లతో సులభంగా విరాళాలు

- 50 రోజుల్లో రూ.55 లక్షల విరాళాలు

తిరుమల, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.1 నుంచి రూ.లక్షలోపు విరాళం ఇవ్వాలనుకున్న భక్తుల కోసం తిరుమలలోని వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో కియోస్క్ మిషన్లు(సెల్ఫ్ ఆపరేటెడ్ ఆన్‌లైన్ పేమెంట్) ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ మిషన్ల ద్వారా అన్నప్రసాదం ట్రస్టుకు 50 రోజుల్లో రూ.55 లక్షలు విరాళంగా అందాయి. తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, ఒంటిమిట్ట కోదండ రామాలయం, బెంగళూరులో శ్రీవారి ఆలయంలో కూడా ఈ మిషన్లు ప్రారంభించారు. ఈ మూడు ఆలయాల్లో 15 రోజుల్లో రూ.5 లక్షల విరాళాలు అందాయి. అలాగే శనివారం పేరూరు సమీపంలోని వకుళమాత ఆలయంలోనూ ఈ మిషన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. మరో వారం రోజుల్లో విజయవాడ, చెన్నై, హైదరాబాద్‌లోని శ్రీవారి ఆలయాల్లో అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రస్తుతం అన్నప్రసాదం ట్రస్టుకు మాత్రమే విరాళాలు ఇచ్చే అవకాశముంది. త్వరలో టీటీడీ ఆలయాల్లోని అన్ని సేవలకు ఈ మిషన్ల ద్వారా నగదు రహిత చెల్లింపు చేసే విధానాన్ని టీటీడీ అందుబాటులోకి తీసుకురానుంది.

31న పింఛన్ల పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను జిల్లాలో ఒకరోజు ముందుగానే పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ శనివారం తెలిపారు. జనవరి ఒకటి నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని డిసెంబరు 31న లబ్ధిదారులకు ఇంటి వద్దనే పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో 2,63,995మంది పింఛనుదారులకు రూ.112 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. 31వ తేదీ తీసుకోలేని వారికి 2వ తేదీ ఇంటి వద్దనే పంపిణీ చేస్తారని వివరించారు. జీవిత భాగస్వామి మరణించిన వారికి ఇదేనెలలో కొత్త పింఛను మంజూరు చేస్తామని తెలిపారు.

సమన్వయంతో పక్షుల పండుగను విజయవంతం చేస్తాం

- మత్స్యశాఖ డీడీ నాగరాజు
- పడవ షికారుకు తొలగిన అడ్డంకులు



పడవల రేవును పరిశీలిస్తున్న మత్స్యశాఖ డీడీ నాగరాజు

తడ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల తర్వాత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించతలపెట్టిన పక్షుల పండుగను అధికారులు, మత్స్యకారుల సమన్వయంతో విజయవంతం చేస్తామని మత్స్యశాఖ డీడీ నాగరాజు అన్నారు. శనివారం సాయంత్రం భీములవారిపాళెం పడవల రేవుకు వచ్చిన ఆయన అక్కడి పరిస్థితులను పరిశీలించారు. చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు సూచనలిచ్చారు. పర్యాటకశాఖ రిసార్టులో మత్స్యకార నాయకులతో సమావేశమయ్యారు. పడవల బకాయిలు, పడవల ఏర్పాటుపై చర్చించారు. రాబోయే పండుగలో 30 పడవల ఏర్పాటుకు మత్స్యకారులు అంగీకారం తెలిపారని ఆయన మీడియాకు వెల్లడించారు. సమావేశంలో డీడీతోపాటు ఎంపీడీవో విజయకుమార్, మత్స్యకార నాయకులు బొమ్మన పళణి, శ్రీధర్, సుధాకర్, ఏకాంబరం, ప్రకాష్, ఎఫ్‌బీవో మహిజ, ఎంపీటీసీ రమేష్ పాల్గొన్నారు.

385 ద్విచక్ర వాహనాల సైలెన్సర్ల ధ్వంసం



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శబ్ద కాలుష్యం చేస్తున్న 385 ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను ఎస్పీ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో శనివారం ధ్వంసం చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ర్యాష్ డ్రైవింగ్, అధిక శబ్దం, హారన్ కలిగిన వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. సైలెన్సర్లు మార్చే మెకానిక్‌లపైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. 65 డెసిబెల్ కంటే ఎక్కువగా శబ్ద కాలుష్యం చేసే వాహనాలను ట్రాఫిక్ పోలీసులు గుర్తించారన్నారు. వారి తల్లిదండ్రులకు త్వరలో కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. కాగా, పద్మావతీ విశ్వవిద్యాలయం వద్ద హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. ఎస్పీ బుల్లెట్ తోలుతూ ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, వెంకట్రావు, డీఎస్పీ రామకృష్ణమాచారి, ఎస్బీ డీఎస్పీ గిరిధర్, సీఐ శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, సంజీవకుమార్, భాస్కర నాయక్, ట్రాఫిక్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులకు 1,041 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు శనివారం 1,041 అర్జీలు అందాయి. ఇప్పటివరకు మొత్తం 13,803 అర్జీలు వచ్చాయి. శనివారం వచ్చిన అర్జీల్లో హౌస్ సైట్స్‌పై 131, అసైన్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ల్యాండ్ 132, మీసేవ గ్రీవెన్స్(రెవెన్యూ)పై 13, క్యాస్ట్ వెరిఫికేషన్ 1, ఫాం 22ఏ 324, రీసర్వే 47, ల్యాండ్ గ్రాబింగ్ 1, ఆర్‌వోఆర్‌పై 248, ఇతర విషయాలకు సంబంధించి 138 వచ్చాయి. అందులో 114 అర్జీలను అప్పటికప్పుడే పరిష్కరించారు.

తిరుపతి-హజరత్ నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు కోచ్‌లు

తిరుపతి(ఆటోనగర్)డిసెంబరు28(ఆంధ్రజ్యోతి) : తిరుపతి-హజరత్ నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు కోచ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని జనవరి నుంచి 31వ తేదీ వరకు ఈ ఎక్స్‌ప్రెస్ రైళ్ల (12707-12708-12793-12794)కు రెండు సాధారణ, స్లీపర్ కోచ్‌లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

జూనియర్ లైన్‌మెన్ చేతివాటం రూ.2 లక్షల నగదుతో పరార్

కోట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కోట సబ్‌స్టేషన్‌లో జూనియర్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్ అలియాస్ చంద్ర విద్యుత్ బిల్లులు వసూలు చేసిన నగదుతో పరారైనట్లు ట్రాన్స్‌కో ఏఈ తేజ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చంద్రశేఖర్ గత నెలలో కోట పట్టణంలో విద్యుత్ బిల్లులు వసూలు చేశారని, వినియోగదారుల నుంచి ఆయన నంబరుకురూ.2 లక్షల వరకు ఫోన్‌పే చేయించుకొని ట్రాన్స్‌కో కార్యాలయంలో జమ చేయకుండా అజ్ఞాతంలో వెళ్లిపోయడని పేర్కొన్నారు. కాగా, ఈనెల 21వ తేదీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా విధులకు హాజరుకానందుకు చంద్రశేఖర్‌ను సస్పెండ్ చేసినట్లు ఏడీఈ చిన్నయ్య తెలిపారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

మెప్మా పీడీ రవీంద్ర



సీపీల సమావేశంలో మెప్మా పీడీ రవీంద్ర, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

కుప్పం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనుకునే మహిళలకు తగు ప్రోత్సాహం ప్రభుత్వంనుంచి అందిస్తామని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.రవీంద్ర అన్నారు. కుప్పం పురపాలక సంఘంలో శనివారం ఆయన పర్యటించారు.మెప్మా కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావుతో కలిసి మహిళా సంఘాల రిసోర్స్ పర్సన్ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో ఒక వ్యాపారవేత్త రూపొందాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయమని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలనుంచి పారిశ్రామికవేత్తలు రావాలని ఆశిస్తున్నారని చెప్పారు. అదే లక్ష్యంగా మెప్మా పలు కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తున్నదన్నారు. మహిళా సంఘాలలోని ప్రతి సభ్యురాలూ ఏడాదికి కనీసం లక్ష రూపాయలకు తగ్గకుండా జీవనోపాధులను మెరుగుపరచుకోవాలని పిలుపునిచ్చారు. దీనికి అవసరమైన శిక్షణ, మార్కెటింగ్ సదుపాయాలను, ఆర్థిక సాయాన్ని మెప్మా ద్వారా అందజేస్తామని చెప్పారు. అంతకుముందు రవీంద్ర మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుతో కలిసి కుప్పంలో వీధి విక్రయదారులు వ్యాపారాలు చేసుకోవడానికి అనువైన ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం సమీక్షా సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ ప్లంబర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ఏసీ, గీజర్, టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషిన్ తదితరాలు మరమ్మతు చేసేవారితోపాటు బ్యూటీషియన్ వంటి సేవలు చేసేవారికి తగు శిక్షణ ఇస్తామన్నారు. ఎన్ఎస్‌డీసీ, ఎస్డీసీ, న్యాక్ తదితర సంస్థల ద్వారా మహిళలకు వృత్తుల విషయంలో సైతం శిక్షణ ఇప్పిస్తామన్నారు.శిక్షణ పొందినవారికి సర్టిఫికెట్‌తోపాటు అర్హత కలిగిన వారికి హోమ్ ట్రయాంగిల్ ప్లాట్‌ఫామ్ ద్వారా జీవనోపాధి కల్పిస్తామన్నారు. ఇటువంటి సేవలు అందించే ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 31వ తేదీదాకా మెప్మా కార్యాలయంలో తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా జనవరి 6వ తేదీన పురపాలక సంఘంలో సర్వీస్ ప్రొవైడర్స్ రిజిస్ట్రేషన్ మేళా నిర్వహిస్తామన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఆధార్ కార్డు, పాన్ కార్డు, బ్యాంకు పాస్ బుక్ జిరాక్సులతోపాటు రెండు పాస్‌పోర్ట్ ఫోటోలు తీసుకుని హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు మెప్మా కోఆర్డినేటర్ ఎం.జగదీశ్ (9162978897)ను సంప్రదించాలని సూచించారు.

కుప్పం క్వారీలపై మైనింగ్ అధికారుల దాడులు

36 బ్లాకుల సీజ్



క్వారీ బ్లాకులను సీజ్ చేస్తున్న మైనింగ్ అధికారులు

కుప్పం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలంలోని గ్రానైట్ క్వారీలపై గనులు, భూగర్భశాఖ అధికారులు శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. అక్రమంగా క్వారీయింగ్ జరుగుతున్న ప్రాంతాలనుంచి మొత్తం 18 బ్లాకులను సీజ్ చేశారు. మండలంలోని శీగలపల్లె సర్వే నెంబర్ 67, కంగుంది సర్వే నెంబర్ 1 లలో అక్రమంగా క్వారీలు నడుస్తున్నట్లు అధికారులకు సమాచారం అందింది. మైనింగ్ ఏడీ బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం దాడులు జరిపారు. అప్పటికే గుట్టలు పగులగొట్టి సిద్ధంగా ఉంచిన గ్రానైట్ బ్లాకులు సీజ్ చేశారు. శీగలపల్లె సర్వే నెంబర్ 67లో 18బ్లాకులు, కంగుంది సర్వే నెంబర్ 1లో మరో 18బ్లాకులు సీజ్ చేసినట్లు ఏడీ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు.

అత్యాచార నిరోధక చట్టంపై సమావేశం రేపు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో సోమవారం ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలుపై నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరుగుతుంది. ఈ మేరకు జిల్లా ఎస్సీ సంక్షేమం, సాధికారిత అధికారి రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి కమిటీ సభ్యులు తప్పక హాజరుకావాలని కోరారు.

ఏపీ కమర్షియల్ ట్యాక్స్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పూర్ణం



నూతన కార్యవర్గ సభ్యులు

చిత్తూరు రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏపీ కమర్షియల్ ట్యాక్స్ సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి వేణుగోపాల్, పరిశీలకుడు పాణిగ్రాహి తెలిపారు. శనివారం చిత్తూరు కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయంలో నూతన కమిటీని ప్రకటించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా పూర్ణం, అసోసియేట్ అధ్యక్షుడిగా నవీద్‌బాషా, ఉపాధ్యక్షులుగా వెంకటేష్, నాగరాజు, మదన్‌మోహన్, జగదీష్ బాబు ఎన్నికయ్యారన్నారు. కార్యదర్శిగా గిరిధర్, కార్యనిర్వాహక కార్యదర్శిగా యోగేంద్రబాబు, సంయుక్త కార్యదర్శులుగా అనిల్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, మాధవి, హరిప్రసాద్, కోశాధికారిగా సురేష్‌బాబు, మహిళ కార్యదర్శిగా లత, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా హరిబాబు నాయక్ ఎంపికయ్యారని తెలియజేశారు.

లక్ష్మీ ఇంట పండగొచ్చింది

కువైత్ చెర నుంచి శ్రీకాళహస్తికి.. - సాయం చేసినవారికి కృతజ్ఞతలు



శ్రీకాళహస్తికి చేరుకున్న లక్ష్మి

తిరుపతి, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి) : కువైత్‌లోని ఏజెంట్ చెరలో చిక్కుకున్న శ్రీకాళహస్తి మండలం రాజీవ్‌నగర్‌కు చెందిన ఎల్లంపల్లి లక్ష్మి స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంది. శుక్రవారం రాత్రి తన ఇంటికి చేరుకోవడంతో కుటుంబ సభ్యుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. వారి ఇంట పండుగ వాతావరణం కనిపించింది. బిడ్డలను చదివించుకోవాలని కష్టపడి కువైత్‌కు వెళ్లి నరకకూపంలో చిక్కుకున్న ఆమె ఆవేదనకు 'ఆంధ్రజ్యోతి' అక్షర రూపమిచ్చింది. ఇండియాకు వెళ్లిపోతానంటే 'నన్ను చంపి ఎడారిలో పడేస్తామంటున్నారు' అన్న శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఎస్పీ సుబ్బరాయుడు స్పందించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ప్రత్యేక చొరవ తీసుకుని ఆమెకు విమాన టికెట్ సిద్ధం చేశారు. దుబాయ్‌లో ఉన్న తిరుపతికి చెందిన ఏపీఎన్ఆర్టీ మాజీ కోఆర్డినేటర్ డాక్టర్ ముక్కు తులసీకుమార్ ఆమెకు పాస్‌పోర్ట్ అందేలా కృషి చేశారు. దీంతో ఆమె శుక్రవారం ఉదయం కువైత్ నుంచి చెన్నై విమానాశ్రయానికి చేరుకున్నారు. తీవ్రమైన మానసిక ఒత్తిడితో ఉన్నట్లు కనిపించారు. ఒకరోజంతా కుటుంబ సభ్యులతో గడిపిన తర్వాత కాస్త కుదుటపడ్డారు. తన ఆవేదనను అందరికీ తెలిసేలా చేసిన 'ఆంధ్రజ్యోతి'కి, ప్రత్యేక చొరవ తీసుకున్న ఎస్పీ సుబ్బరాయుడుకు, కూటమి ప్రభుత్వానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. మా అమ్మను మళ్లీ ఇలా చూస్తామనుకోలేదని, సహకరించిన వారందరికీ పేరుపేరున రుణపడి ఉంటామని కుమార్తె సుచిత్ర అంటున్నారు.

శ్రీగంధం స్మగ్లింగ్ ముఠా అరెస్టు

11 మంది పట్టుబడగా, పరారీలో ఒకరు



నిందితుల వివరాలు తెలియజేస్తున్న డీఎఫ్‌వో భరణి

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీగంధం దుంగలను స్మగ్లింగ్ చేస్తున్న 11 మందితో కూడిన ముఠాను అరెస్టు చేసినట్లు డీఎఫ్‌వో భరణి తెలిపారు. శనివారం అటవీశాఖ తూర్పు రేంజ్ కార్యాలయంలో ఎఫ్ఆర్వో థామస్ సుకుమార్‌తో కలిసి మీడియాకు వివరాలు తెలిపారు. విశ్వసనీయ సమాచారంతో రెండ్రోజులుగా నిఘా పెట్టారు. చిత్తూరు జిల్లా కేంద్రంగా చేసుకుని ముఠా సభ్యులు బెంగళూరుకు 40 కిలోల శ్రీగంధం తరలించడానికి ప్రయత్నిస్తుండగా పట్టుకున్నారు. 11 మంది పట్టుబడగా, ఒకరు పరారీలో ఉన్నారు. అరెస్టు చేసిన వారిలో.. చిత్తూరు, కడప జిల్లాకు చెందిన విజయ్‌కుమార్, రాజా, బాలాజీ, చిరంజీవి, శ్రీనివాసన్, నాగరాజు, చిన్నబ్బ, వేణు, హరిబాబు, వెంకటేష్, వి.చిరంజీవి ఉన్నారు. వీరి వద్ద నుంచి ఆరు సెల్‌ఫోన్లు, నాలుగు ద్విచక్రవాహనాలు కూడా సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న శ్రీగంధం విలువ సుమారు రూ.6.06 లక్షలు ఉంటుందని డీఎఫ్‌వో తెలిపారు. అటవీ, పట్టా భూముల్లో చెట్లు నరికి తెచ్చినట్లు శ్రీగంధం తెచ్చినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. చిత్తూరుకు చెందిన విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ అక్రమ వ్యాపారం సాగుతుండగా, గోకులం వీధిలో స్టాక్ పాయింట్, ప్రశాంత్ నగర్‌లో స్టోరేజ్ పాయింట్‌లు గుర్తించామన్నారు. నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచి రిమాండ్‌కు పంపనున్నట్లు తెలిపారు. ఎఫ్ఆర్వో థామస్ నేతృత్వంలో జరిగిన ఈ ఆపరేషన్ సెక్షన్ ఆఫీసర్ ఉష, బీట్ అధికారులు మధు, వందన్, గౌస్‌బాషా, ప్రభాకర్, షణ్ముగం, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

ముగ్గురు మహిళా చైన్‌స్నాచర్ల అరెస్టు





స్వాధీనం చేసుకున్న బంగారు నగలు - నిందితుల వివరాలు తెలియజేస్తున్న సీఐ నెట్టికంఠయ్య

చిత్తూరు అర్బన్,డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ముగ్గురు మహిళా చైన్‌స్నాచర్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 4.10 లక్షల విలువైన 58 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలను రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మల్లీశ్వరితో కలిసి సీఐ నెట్టికంఠయ్య శనివారం మీడియాకు తెలిపారు. ఈనెల 26వ తేదీన చిత్తూరు రామ్‌నగర్‌కాలనీలో ఉంటున్న కుమారుడి ఇంటి నుంచి యాదమరి మండలం ఎర్రజేనుకు వెళ్లడానికి జ్ఞానమ్మ(65) దర్గా వద్ద ఆటో ఎక్కారు. తన పర్సులో రూ.20వేలతోపాటు 58 గ్రాముల బంగారు నగల (చైను, రెండు గాజులు, రెండు జతల కమ్మలు, మూడు ఉంగరాలు, ఒక కాసు)ను ఉంచి.. దాన్ని బ్యాగులో పెట్టారు. మార్గమధ్యంలోని కాజూరు వద్ద ముగ్గురు మహిళలు అదే ఆటో ఎక్కారు. కమ్మరాయని మిట్ట వద్దకొచ్చేసరికి ముగ్గురు మహిళలు ఆటో దిగేశారు. జ్ఞానమ్మ యాదమరిలో ఆటో దిగి.. డబ్బులివ్వడానికి బ్యాగును చూడగా ఒకచోట కత్తిరించి ఉంది. గాబరా పడిన వృద్ధురాలు బ్యాగులోని పర్సు కోసం చూడగా అది కనపడలేదు. ఈ సంఘటనపై అదే రోజు మధ్యాహ్నంపైన రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సాంకేతికతను ఉపయోగించి దారి పొడవునా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించడంతోపాటు పాత నేరస్తులపైనా నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో శనివారం చిత్తూరు ఓబనపల్లె ప్రభుత్వ పాఠశాల వద్ద అనుమానాస్పదంగా కనిపించిన మంగసముద్రం హౌసింగ్‌కాలనీకి చెందిన మేకల గోవిందు భార్య మేకల దుర్గ(49), లేట్ రామకృష్ణ భార్య తోట లలిత(30), శంకర్ భార్య గంట లలితను అదుపులోకి తీసుకుని విచారించారు. వీరంతా చైన్‌స్నాచర్లుగా తేలింది. దీంతో చోరీ చేసిన 58 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదైన 24 గంటల్లోనే నిందితులను పట్టుకున్న రెండో పట్టణ పోలీసులను డీఎస్పీ సాయినాథ్ ప్రత్యేకంగా అభినందించారు.

విద్యుత్తు వ్యవస్థను ధ్వంసం చేసి నీతులు మాట్లాడతారా?

- వైసీపీ ఎమ్మెల్సీ భరత్‌పై కంచర్ల ధ్వజం



మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ కంచర్ల, మనోహర్ తదితరులు

కుప్పం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు శాఖను పూర్తిగా ధ్వంసం చేసి, ఇప్పుడు నీతులు మాట్లాడతారా అంటూ వైసీపీ ఎమ్మెల్సీ భరత్‌పై ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ధ్వజమెత్తారు. విద్యుత్తు చార్జీలకు నిరసనగా వైసీపీ చేసిన ఆందోళనలపై ఆయన తీవ్రంగా స్పందించారు.టీడీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కంచర్ల మాట్లాడుతూ విద్యుత్తు వ్యవస్థను నిర్వీర్యం చేసి వరుసగా విద్యుత్తు చార్జీలు దొడ్డిదారిన పెంచి రాష్ట్ర ప్రజల నడ్డి విరిచిన వ్యక్తి జగన్ కాదా అని నిలదీశారు.కుప్పంలో గ్రామీణ రైతులకోసం ఏర్పాటు చేసిన రెస్కో అద్భుతంగా పనిచేసేదని,అయిదేళ్ల వైసీపీ పాలనలోనే పూర్తిగా అవినీతిమయమైందని ధ్వజమెత్తారు. అర్హత లేకున్నా ఉద్యోగాలు ఇవ్వడమేకాక, భారీగా పేరుకుపోయిన విద్యుత్తు బకాయిలను సగానికిపైగా మాఫీ చేశారని విమర్శించారు. దీనివల్ల సామాన్య రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్డు ఎండీ చేసిన అవినీతి బాగోతం గురించి, ఆయనకు అండగా నిలిచి అందులో భాగం పంచుకున్న నేతల గురించి ఎవరికి తెలియదని నిలదీశారు. రెస్కోలో అంతస్థాయిలో అవినీతి జరిగితే కనీసం ఒక్కమాట కూడా మాట్లాడని ఎమ్మెల్సీ భరత్, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని అదే సంస్థ ఎదుట నిలబడి నిరసన చేపడతారని ప్రశ్నించారు. కుప్పం సర్వతోముఖాభివృద్ధి మాత్రమే టీడీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని, వైసీపీ నేతల్లాగా చిల్లర రాజకీయాలు చేయబోమన్నారు. కుప్పంలో త్వరలోనే సోలార్ విద్యుత్తును ఉచితంగా అందరికీ అందిస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్ మాట్లాడుతూ కుప్పంలో ఒక్క రూపాయి కట్టకుండా సోలార్ పవర్ పైలెట్ ప్రాజెక్ట్ తీసుకును ముఖ్యమంత్రి తీసుకు వస్తున్నారని చెప్పారు.టీడీపీ నాయకులు ఏపీ.రవి, భారతి, వళ్లెప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

8లక్షల విలువైన బంగారం, వెండి, రెండు ద్విచక్రవాహనాల స్వాధీనం



అంతర్రాష్ట్ర ముఠా నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు నగలు, ద్విచక్రవాహనాలతో వెస్ట్ సీఐ శ్రీధర్ నాయుడు, ఎస్ఐ ఈశ్వర్

యాదమరి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఎనిమిది లక్షల విలువైన బంగారం, వెండి, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. యాదమరి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ ఈశ్వర్‌తో కలిసి వెస్ట్ సీఐ శ్రీధర్ నాయుడు శనివారం మీడియాకు వివరాలు తెలిపారు. యాదమరి మండల పరిధిలోని ఎర్రచేనుమిట్టలో ఆగస్టు 22వ తేదీన కొట్టాల రహదారి రోడ్డులో ఒంటరి ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఇంట్లో నివాసం ఉంటున్న సురేంద్ర, సుధారాణి దంపతులు బంధువుల వివాహానికి వెళ్లారు. ఆ సమయంలో తాళం పగలగొట్టి ఇంట్లోకి వెళ్లి బీరువాలోని 144 గ్రాముల బంగారం, వెండి, కొంత నగదును దుండగులు అపహరించుకెళ్లారు. దీనిపై బాధితులు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. అప్పటికే మండలపరిధిలో ఒంటరి ఇళ్లు, ఆలయాల హుండీలే లక్ష్యంగా చేసుకుని చోరీలు జరుగుతుండటంతో ఎస్పీ మణికంఠ, వెస్ట్ సీఐ ఆధ్వర్యంలో యాదమరి ఎస్ఐ ఓ బృందాన్ని ఏర్పాటు చేశారు. దర్యాప్తులో భాగంగా ప్రధాన నిందితుడు, పాత నేరస్తుడు తమిళనాడు రాష్ట్రం పేర్నంబట్టుకు చెందిన ఈశ్వరన్‌ను గత నెలలో అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి 47.5 గ్రాముల బంగారం రికవరీ చేశారు. అతడిచ్చిన సమాచారంతో మిగిలిన ఇద్దరినీ ప్రస్తుతం అరెస్టు చేశారు. వీరిద్దరినీ తమిళనాడు రాష్ట్రం అంబూరు తాలూకా ఆర్.పట్టి గ్రామానికి చెందిన విక్రం దేవరాజ్, పరదరామి నల్లాంగనూరుకు చెందిన సెల్వరాజ్ పెరుమాళ్‌గా గుర్తించారు. వీరి వద్ద నుంచి ఎర్రచేనులో రెండుచోట్ల జరిగిన దొంగతనాలకు సంబంధించి 6.80లక్షల విలువైన 170 గ్రాముల బంగారం, 10వేల విలువైన 107 గ్రాముల వెండి, రెండు ద్విచక్రవాహనాలు కలిపి రూ.8.10 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురిపై కర్ణాటక రాష్ట్రం బెంగళూరు, తమిళనాడు రాష్ట్రంలోని వేలూరు తదితర ప్రాంత పోలీసు స్టేషన్ల పరిధిలో కేసులున్నట్లు తేలింది. నిందితులను అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన ఎస్ఐ, సిబ్బందిని సీఐ అభినందించారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

తిరుపతి 5వ ఏడీజే కోర్టు జడ్జి రామ్‌గోపాల్



విద్యార్థులకు సూచనలిస్తున్న జడ్జి రామ్‌గోపాల్

నగరి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరమని తిరుపతి 5వ ఏడీజే కోర్టు జడ్జి రామ్‌గోపాల్ తెలిపారు. నగరి పీసీఎన్ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యాహక్కు చట్టాన్ని తెలియజేశారు. అనంతరం నగరి కోర్టును తనిఖీ చేశారు. కోర్టులో వసతులను ఆరాతీశారు. నగరి కోర్టు జడ్జి విష్ణువర్మతోకలిసి జూనియర్ న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి విధులపై అవగాహన కల్పించారు. నగరి సీఐ మహేశ్వర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగదీశన్, ఉపాధ్యక్షుడు బాబు, సీనియర్ న్యాయవాదులు సుబ్రహ్మణ్యంరెడ్డి, ఉదయభాను, చిరంజీవులు శెట్టి, సోమసుందరం పాల్గొన్నారు.

ఆళ్లమడుగు పీహెచ్‌సీలో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా గణాంకాధికారి జార్జ్

వెదురుకుప్పం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం ఆళ్లమడుగు ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని శనివారం జిల్లా గణాంకాధికారి వి.జార్జ్ తనిఖీ చేశారు. టాస్క్‌ఫోర్స్ కమిటీ తనిఖీలో భాగంగా ఆన్‌లైన్‌లో నమోదవుతున్న రిపోర్టులు, క్షేత్రస్థాయిలోని రికార్డులను పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి మాతృత్వ యోజన కార్యక్రమాలు, జేఎస్‌వై, జేఎస్కే అమలు తీరు, గర్భిణులకు అందుతున్న వైద్య సేవలను ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. హెల్త్ అసిస్టెంటు కృష్ణారెడ్డి, ఎంహెల్‌హెచ్పీలు పద్మ, జయంతి, గజేంద్రన్, నాని, ఏఎన్ఎం రేవతి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం





బాలికల విభాగంలో తలపడుతున్న చిత్తూరు పీఈఎస్ - తూర్పుగోదావరి జట్ల క్రీడాకారులు - బాలుర విభాగంలో పోటీపడుతున్న అనంతపురం - కృష్ణా జట్ల క్రీడాకారులు

యాదమరి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండల పరిధిలోని మోర్ధానపల్లె వద్ద ఉన్న పీఈఎస్ పబ్లిక్ పాఠశాల వేదికగా రాష్ట్రస్థాయి బాల, బాలికల బాస్కెట్ బాల్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. బాస్కెట్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ట్రెజరర్ టి.చెంగల్రాయ నాయుడు ఈ పోటీలను ప్రారంభించి, ప్రసంగించారు. రాష్ట్రవ్యాప్తంగా 35కుపైగా జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పీఈఎస్ విద్యాసంస్థల డైరెక్టర్ సత్యనారాయణ, పాఠశాల డైరెక్టర్ కుమారస్వామి నాయుడు, ప్రిన్సిపాల్ వై.వి.కృష్ణబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు. తొలి రోజులు పోటీల ఫలితాలను ప్రకటించారు.

ఫలితాలిలా..

బాలికల విభాగంలో.. పీఈఎస్ పాఠశాల సెమీస్‌కు చేరగా, అనంతపురం జట్టు క్వార్టర్స్‌కు అర్హత సాధించింది. బాలుర విభాగంలో.. ఉమ్మడి చిత్తూరు జిల్లా వీసీఆర్, పీఈఎస్ జట్లు క్వార్టర్స్‌కు అర్హత సాధించగా, అనంతపురం, నంద్యాల జిల్లాల జట్లు ముందంజలో ఉన్నాయి.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

సోమల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన ప్రతి పంటను ఈ-క్రాప్ నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్ తెలిపారు. శనివారం సోమల మండలం ఇరికిపెంట రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సంఘానికి ప్రభుత్వ భూమి కేటాయింపునకు స్థల పరిశీలన చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో 20 సెంట్లు ప్రభుత్వ భూమి కోసం తహసీల్దారు బెన్నురాజ్‌తో కలిసి సందర్శించారు. అలాగే రైతు ఉత్పత్తిదారులు ఏర్పాటు చేసిన దుకాణాన్ని సందర్శించి రికార్డులు, ఎరువులు, పురుగుమందులను తనిఖీ చేశారు. రైతుల పొలాలను సందర్శించి ఈ- క్రాప్ నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పుంగనూరు ఏడీఏ శివకుమార్ రాజు, ఏవో సుధాకర్, మాజీ సర్పంచ్ శ్రీనివాసులునాయుడు. రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మునికృష్ణ, సీఆవో రజని, బాబూనాయుడు, కోటీశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో టెకీ మృతి


మృతి చెందిన మధుకుమార్

సదుం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన సదుం మండలంలో శనివారం జరిగింది. ఎస్‌ఐ షేక్‌షావలి కథనం మేరకు .. మండల పరిధిలోని పాలమంద పంచాయతీ చింతలవారిపల్లెకు చెందిన మధుకుమార్ (32), అదే గ్రామానికి చెందిన రెహానా (28) పదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంత కాలం సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేసిన మధుకుమార్ మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతూ ఉండేవి. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి స్వగృహంలో దంపతులిద్దరూ మద్యం సేవించారు. శనివారం తెల్లవారుజామున మధుకుమార్ అనుమానాస్పదంగా విగతజీవిగా పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

రామకుప్పం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బల్ల గ్రామానికి చెందిన టీడీపీ వీరాభిమాని వళ్లెమ్మ శనివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఆమె పార్టీ వీరాభిమానిగా ఉంటున్నారు. ఆమె మృతిపై టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, జిల్లా కార్యదర్శి జయశంకర్, తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాగభూషణం, స్థానిక నేతలు మునిరత్నం, ఎర్రప్ప తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబానికి పార్టీ తరపున రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి



కల్లూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం కృషి చేయాలని చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ సూచించారు. పులిచెర్ల మండలం కల్లూరు పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేసుల వివరాలు, సిబ్బంది పనితీరుపై ఎస్‌ఐ వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. ●రొంపిచెర్ల: రొంపిచెర్ల పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ సాయినాథ్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో పనిచేసే సిబ్బంది పనితీరు, రికార్డులు పరిశీలించారు. ఎస్‌ఐ సుబ్బారెడ్డి, ఏఎస్‌ఐ మధు తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

పలమనేరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు, రాజనీతి శాస్త్రం సబ్జెక్టులకు సంబంధించి అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశులు తెలిపారు. పీజీతో పాటు స్లెట్, నెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. జనవరి 4 లోపు కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

ఫైనాన్స్ రంగంలో విద్యార్థులు పట్టు సాధించాలి


నిర్వాహకులకు జ్ఞాపికను అందిస్తున్న మదర్‌థెరిసా యాజమాన్యం

గంగవరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి చదువుతో పాటు ఫైనాన్స్, బ్యాంకింగ్ రంగంలో రాణించడానికి విద్యార్థులు కృషిచేయాలని మదర్‌థెరిసా కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు పేర్కొన్నారు. స్థానిక మదర్‌థెరీసా కళాశాలలో గత 16 రోజుల పాటు బజాజ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగంపై నిర్వహించిన అవగాహన సదస్సు శనివారం ముగిసింది. ఫైనాన్స్ రిసోర్స్‌పర్సన్లు, నిర్వాహకులకు కళాశాల తరపున జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ రస్వీమౌసిక్‌అలీ, శ్రీరామకృష్ణ, కళాశాల చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటరావు, వీణ, మునిబాబు పాల్గొన్నారు.

మల్లప్పకొండ దారి సమస్యకు చర్యలు


గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో

గుడుపల్లె, డిసెంబరు 28 (ఆంధ్ర జ్యోతి): బూరుగురపల్లెలో దారి ఆక్రమణపై గత వారం సంగనపల్లెలో జరిగిన రెవెన్యూ సదస్సులో గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దారు కిరణ్‌కుమార్, సర్వేయర్లు, వీఆర్‌వోలు మల్లప్పకొండ దారిని సర్వే చేయడానికి ప్రయత్నించారు. ఆక్రమణదారులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న ఈఆర్డీవో శ్రీనివాసరాజు సర్వే ప్రాంతానికి చేరుకొన్నారు. ఆక్రమణదారుతో మాట్లాడి సర్వేకు సహకరించాలని.. లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సర్వేలో 1.30 ఎకరాల దారి భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. ఆక్రమిత భూమిలో దారిని ఏర్పాటు చేశారు. అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉనికి కోసమే ఆందోళన డ్రామాలు



రొంపిచెర్ల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గంలో ఉనికి కోసం ఆందోళన పేరుతో వైసీపీ నాయకులు డ్రామాలాడుతున్నారని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం రొంపిచెర్ల టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో తొమ్మిది సార్లు కరెంట్ చార్జీలు పెంచి కూటమి ప్రభుత్వంపై బురద జల్లడం సరికాదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా కరెంట్ చార్జీలు పెంచారని నిరసనలు చేయడం వైసీపీ పార్టీ అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందన్నారు. చేసిన తప్పులు ఇతరులపై మోపడం వైసీపీ నాయకులకే చెల్లుతుందన్నారు. విద్యుత్ చార్జీల బాదుడు ఏ ప్రభుత్వంలో జరిగిందో ప్రజలకు తెలుసని, వైసీపీ ప్రభుత్వంలో చేయని అభివృద్ధి సీఎం చంద్రబాబునాయుడు చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ పాల్గొన్నారు.

కాలువ నిర్మాణాల్లో లోపం.. ఇళ్లల్లోకి మురుగునీరు

పుంగనూరు మున్సిపల్ మీట్‌లో కౌన్సిలర్ ఆగ్రహం


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అలీంబాషా

పుంగనూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో ఎన్‌హెచ్‌రోడ్డుకు ఇరువైపుల నిర్మించిన కాలువ నిర్మాణాల్లో నాణ్యత లోపించడంతో మురుగునీరు ఇళ్లల్లోకి వస్తున్నాయని మున్సిపల్ కౌన్సిలర్ ఎం.రామకృష్ణమరాజు ఆరోపించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ అలీంబాషా అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణమరాజు మాట్లాడుతూ పట్టణంలోని రాతిమసీదు, సుబేదార్‌వీధి తదితర ప్రాంతాల నుంచి ప్రవహించే మురుగునీరు తూర్పుమొగసాలలోని ఎన్‌హెచ్ రోడ్డు పక్కన నిర్మించిన కాలువ పనుల్లో ఓ అడుగు హెచ్చుతగ్గులతో నిర్మించడంతో మురుగునీరు ఇళ్లల్లోకి వస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంక్రీట్ సక్రమంగా వేయకపోవడంతో త్వరలోనే కాలువ పాడవుతుందని వాపోయారు. తాగునీరు, మురుగునీటి కాలువల నిర్మాణానికి అధిక శాతం బడ్జెట్ కేటాయించాలని కోరారు. కౌన్సిలర్ పూల త్యాగరాజు మాట్లాడుతూ మున్సిపాలిటీలోని పాత ఇనుప వస్తువులను విక్రయించడానికి చైర్మన్ ముందస్తుగా ఆమోదించడం ఎందుకని.. ప్రజా అవసరాల కోసం ఎందుకు చేయడం లేదని నిలదీశారు. దీంతో కమిషనర్ మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కరించడానికి మున్సిపల్ మంత్రి నారాయణ ప్రత్యేక నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. కౌన్సిలర్ రేష్మా మాట్లాడుతూ మెప్మా అధికారులు మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ గతంలో మెప్మా సిబ్బందికి జీతాలు ప్రభుత్వమే బ్యాంక్ ఖాతాలకు చెల్లించేదని.. జనవరి నుంచి మున్సిపల్ కమిషనర్ జీతాలు చెల్లించాల్సి ఉందన్నారు. మెప్మా సిబ్బంది తన పరిధిలో ఉండటంతో రాబోయే రోజుల్లో చర్యలు తీసుకుంటామన్నారు. కౌన్సిలర్ రెడ్డెమ్మ మాట్లాడుతూ పారిశుధ్య పనులు సక్రమంగా చేయడం లేదని, మురుగునీటి కాలువలు సక్రమంగా లేకపోవడంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కౌన్సిలర్లు నటరాజ, తుంగా మంజునాథ్ మాట్లాడుతూ ఇందిరాసర్కిల్‌లో కౌండిన్య నది కాలువ వద్ద కొంతమంది నిర్మాణాలు చేస్తున్నారని.. ఆ స్థలం ప్రభుత్వానిదా... ప్రైవేటు స్థలమా తెలపాలన్నారు. అనంతరం మున్సిపల్ అధికారులు ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి


ప్రశంసాపత్రాలను అందుకుంటున్న విద్యార్థులు

చౌడేపల్లె, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడానికే వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవోలు కేశవరెడ్డి, తిరుమలమ్మ అన్నారు. శనివారం స్థానిక హైస్కూల్‌లో మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనల పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన కాగతి హైస్కూల్ విద్యార్థి ధనుష్ మొదటి స్థానం, చారాల హైస్కూల్‌కు చెందిన పూజశ్రీ, శరణ్యలు రెండో స్థానం, కోటూరు ఎంపీ యూపీఎస్ స్కూల్‌కు చెందిన ఫాసుల్లా మూడో స్థానం సాధించారు. గెలుపొందిన విద్యార్థులు ఈనెల 30న జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుదర్శన్‌కుమార్, విజయలక్ష్మి, లావణ్య, రఘు, ఆనంద్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

●పలమనేరు: పలమనేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం మండలస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. దొడ్డిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి కె.ఉదయ్‌కిరణ్, గురుకుల పాఠశాల విద్యార్థిని పూజిత, కొలమాసనపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి పవన్, గురుకుల పాఠశాల విద్యార్థిని ఆశశ్రీ, దొడ్డిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి చరణ్‌తేజ్, పెంగరగుంట ఉన్నత పాఠశాల విద్యార్థి గౌతమ్‌రెడ్డి ప్రతిభ చూపారు. ప్రతిభ చూపిన వారికి ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఎంఈవోలు లీలారాణి, బాలసుందరం, నోడల్ హెడ్మాస్టర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

●గుడుపల్లె: గుడుపల్లె ఆదర్శ పాఠశాలలో శనివారం మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన జరిగింది. ఎంఈవో లక్ష్మయ్య విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భువనేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●రొంపిచెర్ల: రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో విదార్థులకు విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఎంఈవోలు ఇందిర, శ్రీనివాసులు, ఇన్‌చార్జి హెచ్‌ఎం మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

●పుంగనూరు రూరల్: విద్యార్థుల్లోని నైపుణ్యతను బయటకు తీయడానికే వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఎంఈవోలు చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డెన్నశెట్టి తెలిపారు. శనివారం స్థానిక కొత్తయిండ్లు మున్సిపల్ పాఠశాలలో మండలస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన జరిగింది. స్టూడెంట్ ప్రాజెక్టు కింద మొదటి స్థానంలో భాష్యం పాఠశాల విద్యార్థి భగీరథ రూపొందిన ఈజీ డివిజన్ సాల్వింగ్, రెండో స్థానంలో కస్తూరిబా గాంధీ పాఠశాల విద్యార్థి తేజశ్రీ, ఫుడ్ మేనేజ్‌మెంట్‌వేస్ట్ ప్రాజెక్టులో మొదటి స్థానంలో ఏపీ మోడల్‌పాఠశాల విద్యార్థి గౌరీశశిధర్ నిలిచినట్లు తెలిపారు.

ఫైనాన్స్ కంపెనీ వేధింపులతో మృతి

పుంగనూరు రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఫైనాన్స్ సంస్థ వేధింపులు ఒకరిని బలిగొన్నాయని అతడి బంధువులు ఆరోపించారు. పుంగనూరులోని మణప్పురం ఫైనాన్స్ సంస్థ కార్యాలయం వద్ద శనివారం వారంతా రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని బీడీకాలనీకి చెందిన అబ్దుల్‌తుల్లా(38) ఎక్స్‌కవేటరు కొనుగోలు కోసం మణప్పురం ఫైనాన్స్ సంస్థలో రూ. 15లక్షలు అప్పు తీసుకున్నాడని, అయితే మూడు నెలలుగా కంతులు చెల్లించకపోవడంతో మూడు రోజుల క్రితం ఎక్స్‌కవేటరును సీజ్ చేసినట్లు తెలిపారు. దీంతో మనోవేదనకు గురైన అబ్దుల్‌తుల్లా శనివారం ఉదయం ఇంటి వద్ద గుండెపోటుతో మృతి చెందినట్లు ఆరోపించారు. మృతుడి భార్య సయ్యద్‌అయేషా ఫిర్యాదు మేరకు ఫైనాన్స్ కంపెనీపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

దాడి కేసులో నిందితులను శిక్షించాలి

పెద్దపంజాణి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా గాలివీడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోపై జరిగిన దాడి కేసులో నిందితులను వెంటనే అరెస్టు చేయాలని శనివారం పెద్దపంజాణి ఎంపీడీవో కార్యాలయం ఎదుట సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఎంపీడీవో బాలాజీ, ఈవోపీఆర్డీ శారదాదేవి, సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

వరసిద్ధుడి సేవలో ఒడిశా హైకోర్టు న్యాయమూర్తి


న్యాయమూర్తికి జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఒడిశా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీపీ రౌత్రే శనివారం కుటుంబ సమేతంగా కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. తహసీల్దార్ మహేష్‌కుమార్, సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు, చిత్తూరు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్ ఫేర్‌లో ఆకట్టుకున్న నమూనాలు


← విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంఈవో

నగరి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరిలోని పీసీఎన్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండలస్థాయి సైన్స్‌ఫేర్‌లో విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. ఎంఈవో శ్రీదేవి, హెచ్‌ఎం శ్యామలాదేవి పాల్గొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

శ్మశానానికి దారి లేకుండా చేస్తారా? / గుడికండ్రిగ వాసుల ఆవేదన


పనులను అడ్డుకుని నినాదాలు చేస్తున్న గుడికండ్రిగ వాసులు

నగరి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్మశానానికి దారి లేకుండా చేస్తారా.. అంటూ నగరి మండలంలోని వీకేఆర్‌పురం పంచాయతీ గుడికండ్రిగ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. చిత్తూరు- తచ్చూరు హైవే నిర్మాణ పనుల్లో భాగంగా గుడికండ్రిగ వద్ద శనివారం వంతెన నిర్మాణానికి ఎక్స్‌కవేటర్‌తో పనులు చేపట్టారు. ఈ పనులను గుడికండ్రిగవాసులు అడ్డుకున్నారు. తాము శ్మశానానికి వెళ్లే దారిలో అడ్డుగా వంతెన నిర్మిస్తే ఎలా అని ప్రశ్నించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎక్స్‌కవేటర్ ఎదుట బైఠాయించి, నినాదాలు తెలిపారు. అధికారులతో చర్చించాక పనులు చేస్తామని అక్కడున్నవారు తెలపడంతో గ్రామస్తులు నిరసన విరమించారు. ఈ నిరసన కార్యక్రమంలో దేశమ్మగుడి మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, గోవిందుడు, వేణు, మునిరత్నంరెడ్డి, మునస్వామి, కన్నెప్పన్, వెంకటేశరెడ్డి, ఎల్లప్పన్, జయరామన్‌తోపాటు గ్రామానికి చెందిన పలువురు మహిళలు పాల్గొన్నారు.

గాలివీడు ఎంపీడీవోపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

● డీహెచ్‌పీఎస్ డిమాండ్



సమావేశంలో పాల్గొన్న నాగరాజు తదితరులు

చిత్తూరు రూరల్, డిసెంబరు 28: అన్నమయ్య జిల్లాలో గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై దాడిచేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి.. కఠినంగా శిక్షించాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) నాయకులు డిమాండ్ చేశారు. శనివారం సమితి కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు పూర్తయినా.. దళిత, గిరిజన, ముస్లిం మైనారిటీలపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. వీటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. నాయకులు నాగరాజు, దామోదరం, మహేష్, చంద్ర, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

● డీఎంహెచ్‌వోకు వినతి


సుధారాణికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చిత్తూరు రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం కోరారు. ఈ మేరకు డీఎంహెచ్‌వో సుధారాణికి శనివారం వినతి పత్రం సమర్పించారు. 30 ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న స్టాఫ్‌నర్సులకు ఇంకా ప్రమోషన్లు ఇవ్వలేదని తెలిపారు. నాయకులు మురళి, షణ్ముగం, పున్నయ్య, సురేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కర్మాగారం కలుషిత నీటితో జనానికి తిప్పలు


జంబాడకు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన కలుషిత నీరు

విజయపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చిన్న జంబాడలోని ప్రైవేటు కర్మాగారం నుంచి కలుషిత నీటితో తిప్పలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నజంబాడ - కనకమ్మ సత్రం రోడ్డు పక్కనున్న కాలువలో ఈ కలుషిత నీరు చేరుతోంది. వర్షం కురిసినప్పుడు పొలాల్లోకి వస్తుండటంతో పంటలు సరిగా పండటం లేదని రైతులు చెబుతున్నారు. దుర్గంధం వెదజల్లుతుండటంతో పాటు మూగజీవాలు ఈ నీటిని తాగి వ్యాధుల బారిన పడుతున్నాయన్నారు. ఇకనైనా కలుషిత నీటిని కర్మాగార యాజమాన్యం శుభ్రపరిచేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్యశిబిరం

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాముల గుడివీధి జైన్ ప్రార్థనా మందిరంలో ఆదివారం చిత్తూరు జైన్ సంఘం ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు జైన్ సంఘం అధ్యక్షుడు సుభాష్ జైన్ తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తిరుపతి అరవింద నేత్ర వైద్యశాల వైద్యుల సహకారంతో ఈ శిబిరం జరుగుతుందన్నారు.

పచ్చికాపల్లం-తిరుపతి రోడ్డు దుస్థితి చూడవయా..!




వెదురుకుప్పం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం నుంచి తిరుపతికి వెళ్లే రహదారి గుంతలతో నిండిపోయింది. దీనివల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ప్రధానంగా పచ్చికాపల్లం సమీపంలో రాజబావి కనుమ వద్ద రోడ్డు మరింత అధ్వానంగా తయారైంది. ఈ మార్గంలో పలుచోట్ల కూడా రోడ్డు దెబ్బతిన్నది.



బురదమయంగా రహదారి

యాదమరి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కీనాటంపల్లె పంచాయతీ కోయిహూరు గ్రామానికి వెళ్లే రహదారి బురదతో నిండిపోయింది. శనివారం సచివాలయానికి చెందిన ఏఎన్‌ఎం.. గ్రామంలోచిన్నారులకు టీకాలు వేయడానికి బయల్దేరారు. చెరువుకట్టపై సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల దూరం బురదమయంగా రహదారి ఉండటంతో తీవ్ర ఇబ్బంది పడ్డారు. అలాగే విద్యార్థులు కూడా పాఠశాలకు వెళ్లడానికి అగచాట్లు పడుతున్నారు. ఇకనైనా ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

బస్టాండు కాంప్లెక్స్ ప్రారంభించేదెప్పుడు?

పెనుమూరు పంచాయతీ ఆదాయానికి గండి పడుతున్న వైనం

పెనుమూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు బస్టాండు కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయ్యి సరిగ్గా ఏడాది అయ్యింది. కానీ ఇంత వరకు ప్రారంభించలేదు. ఓ పక్క ఆటోస్టాండుగా, మరోపక్క పూల వ్యాపారులకు నిలయంగా మారింది. దీంతో బస్సులు ఆగేందుకు తక్కువ స్థలం ఉండటంతో డ్రైవర్లు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంత జరిగే బుధవారం రోజునైతే రోడ్లపైనే అంగళ్లు పెట్టడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కల్గుతోంది. ఈ కాంప్లెక్స్ నిర్మాణానికి జడ్పీ నిధులు రూ.84 లక్షలు, మండల పరిషత్ గ్రాంట్ రూ.15 లక్షలు, సిమెంటు రోడ్డుకు జడ్పీ గ్రాంట్ రూ.24లక్షలు వెచ్చించారు. సుమారు రూ.కోటి ఇరవై లక్షలతో కాంప్లెక్స్ నిర్మించి ఇలా వదిలేయడంపై విమర్శలొస్తున్నాయి. మరోపక్క వారపు సంతగేటు వేలంపాట నిర్వహించక పోవడంతో పంచాయతీ ఆదాయానికీ గండి పడుతోంది. పెనుమూరు పంచాయతీపై కోర్టులో స్టే ఉండటంతో స్థానికఎన్నికలు జరగక 15వ ఆర్థిక సంఘం నిధులు కాస్తా సుమారు రూ.80 లక్షలు ఆగిపోగా.. ఆదాయ వనరులను కూడా గాలికి వదిలేయడంతో గ్రీన్ అంబాసిడర్లకు జీతం కూడా ఇవ్వలేని దుస్థితి ఈ పంచాయతీలో నెలకొంది. ఇకనైనా ఈ కాంప్లెక్స్‌ను ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.



ఫ్లెక్సీలకు నిలయంగా బస్టాండు కాంప్లెక్స్

పదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచినప్పుడు తెలియలేదా జగన్?: టీడీపీ

గుడిపాల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు పదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచినప్పుడు తెలియలేదా జగన్.. అని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ ప్రశ్నించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వ వైఫల్యం కారణంగానే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చిందన్నారు.

పెనుమూరు కానిస్టేబుల్‌కు ప్రశంసాపత్రం


రఘురాంకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ మణికంఠ

పెనుమూరు, డిసెంబరు 28 (ఆంధ్ర జ్యోతి): పెనుమూరు కానిస్టేబుల్ రఘురాంకు కర్ణాటక పోలీసులు ప్రశంసాపత్రాన్ని పంపించారు. కర్ణాటకలో జరిగిన ఓ దొంగతనం కేసులో కీలకంగా వ్యవహరించి, చిత్తూరులో 90 గ్రాముల బంగారాన్ని రికవరీ చేసి.. వారికి సహకరించడంపై అభినందించారు. ఆ ప్రశంసాపత్రాన్ని శనివారం ఎస్పీ మణికంఠ చేతుల మీదుగా అందుకున్నారు.

ధ్యానంపై అవగాహన అవసరం


సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ లావణ్య

ఐరాల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికీ ధ్యానంపై అవగాహన అవసరమని ఎస్వీ అగ్రికల్చర్ కళాశాల అగ్రనోమి అసిస్టెంట్ ప్రొఫెసర్ లావణ్య అన్నారు. 35యర్లంపల్లెలో ధ్యాన మందిరాన్ని ప్రారంభించారు. పిరమిడ్ మాస్టర్ దామోదర్‌రెడ్డి, ప్రొఫెసర్ రెడ్డిరాము, ఐరాల వైద్యుడు ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం ప్రారంభం



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న భీమినేని చిట్టిబాబునాయుడు

పాలసముద్రం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుమలరాజుపురం జడ్పీ హైస్కూల్‌లో గ్రంథాలయాన్ని టీడీపీ కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి భీమినేని చిట్టిబాబునాయుడు శనివారం ప్రారంభించారు. కాగా, బెంగళూరులో ఉంటున్న మండలానికి చెందిన సుందరరాజు, బాబురాజులు విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, సైన్స్ ల్యాబ్‌కు అవసరమైన పరికరాల కొనుగోలుకు రూ.3లక్షలను అందించారు. వీరిని చిట్టిబాబు నాయుడు అభినందించారు. ఎంఈవోలు రాజేంద్రప్రసాద్, గిరిజ, ఆడిటర్ మోహన్‌రాజు, గ్రామస్తులు గంగరాజు, నరసరాజు, ఇన్‌చార్జి హెచ్‌ఎం మురగదాస్, ఉపాధ్యాయులు, ఎస్టీయూ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు కాంగ్రెస్ నేతల నివాళి

నగరి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరిలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి, నేతలు నివాళి అర్పించారు. మాజీ పీసీసీ ప్రధాన కార్యదర్శి బాబు, పీసీసీసభ్యుడు నటరాజమొదలియార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి దేశయ్య, నేతలు చిరంజీవిరెడ్డి, నాగేశ్వరరావు, కుమార్ పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘం ఎన్నికలకు పోటాపోటీ

చిత్తూరు లీగల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు న్యాయవాదుల సంఘం ఎన్నికలకు పలువురు న్యాయవాదులు పోటీ పడుతున్నారు. అధ్యక్ష పదవికి ఎం.చంద్రశేఖర్, హరికృష్ణ, జానకిరామ్ రెడ్డి, మోహన్‌రామిరెడ్డి, కె.శంకర్ నాయుడు పోటీ పడుతున్నారు. ఉపాధ్యక్ష పదవికి భూప్రసన్న, లోకనాథం, సెక్రటరీకి విశ్వనాథం, చక్రవర్తి రెడ్డి, సురేష్ రెడ్డి, ట్రెజరర్‌కు దేవేందర్, మహేశ్వర్, ఆనంద్, లైబ్రేరియన్‌కు వరదరాజులు, రవిచంద్రన్, కల్చరల్‌కు శాంతి, రాజా చంద్రయాదవ్, వెంకటేశ్వర్లు పోటీపడుతున్నట్లు ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది వసంత్ కుమార్ తెలిపారు.

కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి: సీఐటీయూ



సమావేశంలో ప్రసంగిస్తున్న సురేంద్రన్

చిత్తూరు రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్నా కార్మికులను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు సురేంద్రన్, గిరిధర్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని సన్మానించిన ఎమ్మెల్యే


ఎమ్మెల్యే జగన్మోహన్ నివాసంలో మంత్రి సవిత తదితరులు

చిత్తూరు సిటీ, డిసెంబరు 28 (ఆంధ్రప్రదేశ్): రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవితను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సన్మానించారు. జిల్లా పర్యటనలో భాగంగా శనివారం ఆయన నివాసానికి మంత్రి వచ్చారు. చిత్తూరు టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ షణ్ముగం, నేతలు అశోక్, సురేష్, కుమార్, శ్రీదుర్గ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఎమ్మెల్యేని చిత్తూరు ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు దేగల రమేష్ తదితరులు సన్మానించారు. నేతలు వరలక్ష్మి, మధు, కోడిబాబు, రాము, చిట్టి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో


రోగి వివరాలు తెలుసుకుంటున్న సుధారాణి

గుడిపాల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గుడిపాల, బొమ్మసముద్రం పీహెచ్‌సీలను శనివారం డీఎంహెచ్‌వో డాక్టర్ సుధారాణి తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. గర్భిణులకు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. జిల్లా మలేరియా నివారణాధికారి అనిల్‌కుమార్, వైద్యాధికారి చంద్రమహేష్, డీఎంవో అనిల్‌కుమార్, ఎపిడమాలజిస్ట్ వాణి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కష్టాలు తొలగించిన ఎమ్మెల్యే


గుడిపాల క్రాస్ వద్ద బస్సెక్కుతున్న విద్యార్థులు

గుడిపాల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా సాయంత్రం వేళల్లో గుడిపాల క్రాస్ నుంచి తుమ్మలవారిపల్లె, గుడిపాల, పాపసముద్రం, పిళ్లారికుప్పం, బండపల్లె, వెప్పాలమానుచేను, చిత్తపార గ్రామాలకు వెళ్లే విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సదుపాయం లేక ఇబ్బంది పడేవారు. ఈ సమస్యను ఎమ్మెల్యే జగన్మోహన్ దృష్టికి విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యాకమిటీ చైర్మన్ టీఆర్ డిల్లీబాయి, హెచ్‌ఎం కాతూంబీలు తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సాయంత్రం పాఠశాల వదిలే సమయానికి బస్సు అందుబాటులో ఉంచాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. దీంతో బడి వదిలే సమయానికి బస్సు వస్తుండటంతో విద్యార్థుల కష్టాలు తొలగిపోయాయి.

పోలీసుస్టేషన్లలో డీఎస్పీ తనిఖీలు


పెనుమూరులో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ సాయినాథ్

పెనుమూరు/పూతలపట్టు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు పోలీసు స్టేషన్‌ను శనివారం డీఎస్పీ సాయినాథ్ తనిఖీ చేశారు. ప్రజలతో ఫ్రెండ్లీగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం పలు కేసులకు సంబంధించి రికార్డులను తనిఖీ చేశారు. సీఐ శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఎస్‌ఐ వెంకటసుబ్బమ్మ, సిబ్బంది పాల్గొన్నారు. ● పూతలపట్టు పోలీసు స్టేషన్‌ను కూడా డీఎస్పీ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. సీఐ కృష్ణమోహన్ తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



శ్రీరంగరాజపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌పురం జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. మండల స్థాయిలో ఎంపికైన విజేతలను జిల్లా పోటీలకు పంపుతామని ఎంఈవో సబర్మతి తెలిపారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు, సైన్స్ ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు

పెనుమూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా కొనసాగుతుంది. మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూజారి భాస్కర్ ఆధ్వర్యంలో నంజరపల్లె ఏఏడబ్ల్యూలో శనివారం సభ్యత్వ నమోదు చేపట్టారు. చిట్టి, రవి, కుమార్, రమేష్, కిరణ్, బిర్లాబాబు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు

శ్రీరంగరాజపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తయ్యూరులో శనివారం రెవెన్యూ సదస్సు జరిగింది. రైతుల నుంచి అర్జీలను తహసీల్దార్ లోకనాథం పిళ్లై స్వీకరించారు. కార్యక్రమంలో డీటీ రవీంద్రబాబు, సర్వేయర్ సురేష్‌బాబు, నాయకులు రాజేంద్రన్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

నింద్ర: మండలంలోని అత్తూరు ఓరూరుపేట పంచాయతీలో రెవెన్యూ సదస్సు జరిగింది. తహసీల్దార్ శేషగిరిరావు, టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, సాగునీటి సంఘ అధ్యక్షులు రాజేష్, పురుషోత్తంనాయుడు, ఆర్‌ఐ కళావతి, సర్వేయర్ వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

పూతలపట్టు: వేపనపల్లె సచివాలయంలో తహసీల్దార్ గుర్రప్ప ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. అర్జీలను స్వీకరించిన ఆయన సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

వన వేణుగోపాలుడికి పూజలు



వెదురుకుప్పం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): దేవరగుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలో ఉన్న వన వేణుగోపాలస్వామికి శనివారం క్షీరాభిషేకం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన అర్చకులు కె.కార్తీక్ అయ్యంగార్, ప్రధాన కార్యనిర్వాహకుడు శివకుమార్, భక్తులు పాల్గొన్నారు.

10 నుంచి ఏకాదశి ఉత్సవాలు

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గిరింపేట దుర్గాంబ ఆలయంలో జనవరి 10, 11 తేదీల్లో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో మునిశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10న ఉదయం ఆరు నుంచి 11వ తేదీ ఉదయం ఆరుగంటల వరకు భక్తుల జాగరణకు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. భక్తులు విరాళాలు ఇచ్చి అమ్మవారి ఆశీర్వాదం పొందాలని కోరారు.

నందీశ్వరుడికి ప్రదోషకాల పూజలు



వెదురుకుప్పం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని శిష్ట సౌందర్యవల్లి సమేత సదాశివేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు జరిగాయి. సాయంత్రం నందీశ్వరుడికి ప్రదోషకాల పూజలు శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు, కార్యనిర్వాహకులు పాల్గొన్నారు.